ఎడారిలో మెతుకుల వేట



- విధి వక్రీకరించి ఉచ్చులో చిక్కి..
- మంత్రి నారా లోకేశ్ చొరవతో ఎట్టకేలకు ఇంటికి..
- రాయలసీమ కరువునకు దర్పణం.. శివ జీవితం

'బతుకు దెరువు కోసం.. కువైత్‌కు వచ్చా.. ఇక్కడ ఎడారిలో ఒకడినే.. ఉన్నా.. చాలా కష్టంగా ఉంది.. తాగడానికి నీళ్లు కూడా లేవు. నా గోడు ఎవరికైనా చెప్పుకుందామన్నా.. కనుచూపు మేర ఎవరూ లేరు.. దయచేసి ఎవరైనా సాయం చేసి ఆదుకోండి.. ఇంటికి రప్పించండి.. లేకుంటే ఒకటి రెండు రోజుల్లో చచ్చిపోతా...' అంటూ.. ఏడుస్తూ.. వీడియో చేసిన అయివేటి శివ గురించి, ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయం రెండు తెలుగు రాష్ట్రాల్లో తెలియని వాళ్లు ఎవరూ ఉండరేమో.? వాల్మీకిపురం మండలం చింతపర్తిలో నివాసం ఉంటూ.. ఊరూరూ తిరిగి.. పాత్రలు విక్రయిస్తూ.. రోజుకు ఎంతోకొంత సంపాదిస్తూ.. ఉన్నదాంట్లో ప్రశాంతంగా భార్య, ఇద్దరు పిల్లలతో జీవితం గడపాల్సిన శివ.. ఎడారిలో మెతుకుల వేటకు ఎందుకు వెళ్లాడు? అక్కడ విధి వక్రీకరించి.. సమస్యల ఉచ్చులో ఎలా చిక్కుకున్నాడు.. ఎవరు దయ తలచడంతో.. ఇంటికి ఎలా చేరుకున్నాడు.? ఎడారి దీవిలో అతను పడ్డ కష్టాలు..? అతని జీవితం రాయలసీమ ప్రాంతంలోని కరువుకు దర్పణంగా చెప్పుకోవచ్చు.

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం మండలం చింతపర్తిలో బోయకులానికి చెందిన అయివేటి శివ.. నివశిస్తున్నాడు. భార్య శంకరమ్మ, కూతుళ్లు వెన్నెల, వనితలతో కలిసి ఓ బాడుగ ఇంట్లో నివాసం ఉండేవాడు. ఇతనికి సెంటు భూమి కూడా లేదు. అతను ఊరూరా స్కూటర్‌లో తిరుగుతూ.. వంటపాత్రలు అమ్మి జీవించేవాడు. ఒక్కోరోజు రూ..500 నుంచి వెయ్యి రూపాయల వరకు ఆదాయం వచ్చేది. అయితే ఇదే వ్యాపారంలో పోటీ ఎక్కువ కావడం.. ప్లాస్టిక్ పాత్రలు, ఎక్కువగా వినియోగిస్తున్న నేపథ్యంలో.. ఒక్కో రోజు కనీసం రూ.రెండు, మూడు వందలు కూడా వచ్చేది కాదు. ఒక్కోసారి స్కూటర్ పెట్రోల్‌కు సైతం టమోటా తోటల్లో కూలి పనులకు వెళ్లే భార్య ఇవ్వాల్సి వచ్చేది. ఇద్దరూ ఆడపిల్లలే.. ఇలా చాలీచాలని సంపాదనతో.. ఎలా బతకాలి. పిల్లలకు పెళ్ళిళ్లు ఎలా చేయాలి అనుకుంటూ సతమతమవుతూ జీవనం సాగించే వాళ్లు. భార్య, పెద్ద కూతురు ఇద్దరూ టమోటా తోటల్లో కూలి పనులకు రోజూ వెళ్లేవాళ్లు. అయినా సంపాదన ఆశించినంత మేర ఉండడం లేదు. ఈ సమస్యలన్నీ తీరాలంటే.. శివ కువైత్‌కు వెళ్లడమే మార్గమనుకున్నారు. అందుకు తగ్గ ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు.

జగనన్న ఇంటి కోసం అప్పులు..

శివ కువైత్‌కు వెళ్లడానికి ప్రధాన కారణం.. అప్పులు.. వీళ్లకు సుమారు ఆరేడు లక్షల వరకు అప్పులు ఉన్నాయి. ఈ అప్పులు ఎందుకు అయ్యాయంటే..? పెద్ద కథే ఉంది. వీళ్లకు సొంత ఇల్లు లేకపోవడంతో గత ప్రభుత్వ కాలంలో జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఇచ్చారు. అప్పు చేసి పునాది వరకు వేసుకున్నారు. అయితే గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఇచ్చిన అనేక ఇళ్లను వైసీపీ ప్రభుత్వంలో కూలదోసి ఇతరులకు ఇచ్చారు. దీనికి తోడు వీళ్లు టీడీపీ సానుభూతిపరులు.. ఒకవేళ మళ్లీ వైసీపీ ప్రభుత్వం వస్తే.. ఎక్కడ తమ పునాదిని కూల్చివేస్తారో? అని ఆందోళన చెందారు. పునాదిగా ఉంటే..కూల్చివేస్తారు.. అదే ఇల్లు కట్టేస్తే.. కూల్చరు కదా.. అనే ఆలోచనతో.. పునాదిపైన గోడలు పూర్తి చేశారు. ఇక కేవలం మోల్డింగ్ మాత్రమే మిగిలి ఉంది. ఇందుకు గానూ.. సుమారు రూ.6 లక్షలు వరకు అప్పు చేశారు. ఎలాగూ కువైత్‌కు వెళ్తా.. కదా.. అనే ఉద్దేశ్యంతో.. ఇల్లు కట్టడానికి ఖర్చుపెట్టడంలో వెనుకాడలేదు.

అనధికార ఏజెంట్లు.. అవస్థలు

కువైత్‌కు వెళ్లాలని రాయచోటిలో ఒక అనధికార ఏజెంటును ఆశ్రయించారు. పాసుపోర్టు కోసం, వీసా కోసం సుమారు రూ.లక్ష వరకు ఖర్చు చేశారు. గత నెల 9న కువైత్‌కు వెళ్లాడు. అక్కడ పట్టణానికి దూరంగా ఎడారిలో పనికి వదిలారు. అక్కడ బాతులు, గొర్రెలు, ఒంటెలు ఉన్నాయి. అప్పటి వరకు అక్కడ ఉన్న శ్రీలంకకు చెందిన వ్యక్తి గత నెల చివరిలో స్వదేశానికి వెళ్లిపోయాడు. దీంతో శివకు కష్టాలు మొదలయ్యాయి. అక్కడ ఒకడే ఉండిపోయాడు. ఎండకు తట్టుకోలేకపోయాడు. తన గోడు చెప్పుకునేందుకు కనీసం ఒకరు కూడా లేరు. దీంతో ఒంటరిగా ఉండలేక.. తన భార్యకు ఫోన్‌లో తన గోడు వెల్లబోసుకున్నాడు. చేసిన అప్పులు తీర్చేదెలా..? ఓపిక పెట్టుకో...ఎలాగైనా ఉండిపో.. అని భార్య సర్ది చెప్పింది. అయితే రోజురోజుకు భరించలేక.. తన బాధలను వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఇది వారం రోజుల్లో పూర్తి స్థాయిలో వైరల్ అయింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో.. తెలుగు ప్రజలు ఎందరో చూశారు. అయ్యో పాపం.. ఎవరు ఇతను..? ఏ ఊరు.? ఎవరైనా కాపాడాలి అని కోరుకున్నారు. ఈ విషయం తన దృష్టికి రావడంతో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ స్పందించారు. కేంద్ర ప్రభుత్వ అధికారులతో మాట్లాడారు. అదే సమయంలో కువైత్‌లో ఉన్న ఎన్‌ఆర్‌ఐ టీడీపీ నాయకులతోనూ మాట్లాడారు. వెంటనే ఆ నాయకులు శివ ఆచూకీ తెలుసుకుని నారా లోకేశ్‌కు సమాచారం అందించారు. కేంద్ర విదేశీ వ్యవహారాల అధికారులు జోక్యం చేసుకోవడంతో శివ కువైత్‌లోని భారత రాయబార కార్యాలయానికి సోమవారం చేరుకున్నారు. మంగళవారం సాయంత్రం బయలుదేరి అర్ధరాత్రి బెంగుళూరు విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి బుధవారం స్వగ్రామానికి చేరుకున్నారు. అతడిని చూడగానే విమానాశ్రయంలో భార్య, పిల్లలు ఏడుస్తూ కౌగిలించుకున్నారు. తమ తండ్రి క్షేమంగా తమ వద్దకు రావడానికి కారణమైన.. రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, స్థానిక ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. శివ కథనం మేరకు.. తనకు వీసా తీసేటప్పుడు చెప్పింది ఒకటి.. కువైత్‌లో జరిగింది మరొకటి. ఇక్కడేమో 130 దినార్లు జీతమని చెప్పారని, అయితే అక్కడ 100 దీనార్లు మాత్రమే ఇస్తామన్నారు. గొర్రెల వద్ద కాపలాదారునిగా ఉండాలని చెప్పారని, అయితే.. అక్కడ ఉన్న పరిస్థితి వేరని వాపోయాడు. ఏజెంట్లు తమకు చెప్పేది ఒకటైతే.. కువైత్‌లో జరుగుతోంది మరొకటని పేర్కొన్నారు. శివ ఎదుర్కొంటున్న సమస్యలే సాధారణంగా ఎక్కువ మంది ఎదుర్కొంటున్నారు. వీసా కోసం కువైత్‌లో షేట్ డబ్బు ఇచ్చినా.. మళ్లీ ఇక్కడ కూడా కువైత్‌కు వెళ్లే వాళ్ల దగ్గర డబ్బు వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం బాధితుడు శివ జీవితం.. కువైత్.. అక్కడ కష్టాలు.. రాయలసీమలో కరువు పరిస్థితులకు దర్పణంగా చెప్పవచ్చు. ఎందరో ఇక్కడ సరైన వానలు లేక.. పంటలు పండక..బతకడం కష్టమై.. కువైత్, దుబాయి వంటి గల్ఫ్ దేశాలకు వలసలు వెళుతున్నారు. జిల్లాలోని రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, తంబళ్లపల్లె, పీలేరు ప్రాంతాల నుంచి దాదాపు ప్రతి పల్లెలో గల్ఫ్ దేశాలకు వెళ్లిన వాళ్లు కనిపిస్తారు. ఏదైనా ఊర్లో ఉన్న కుటుంబాలలో కనీసం 10 శాతానికి పైనే గల్ఫ్ దేశాలకు వెళ్లిన వాళ్లు కనిపిస్తారు. అందులో అక్కడ కష్టాలు భరించలేక తిరిగి వస్తున్న శివలు కొందరైతే.. ఇక్కడ బతకడం కష్టమై.. చేసిన అప్పులు తీర్చేదారిలేక..అక్కడే జీవచ్ఛావాల్లా ఉంటున్న వాళ్లు లక్షల్లో ఉంటున్నారు.



బెంగళూరు విమానాశ్రయంలో శివ, కుటుంబసభ్యులు



అవతార్‌బాబా విగ్రహావిష్కరణలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

మదనపల్లెలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

సత్సంగ్ ఆశ్రమంలో బాబాజీ ఆలయం ప్రారంభం

మదనపల్లె, జూలై 17: కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ బుధవారం అన్నమయ్య జిల్లా మదనపల్లెకు విచ్చేశారు. పట్టణ శివారులోని సత్సంగ్ ఫౌండేషన్ అధినేత ఎస్.ముంతాజ్‌అలీ (శ్రీఎం)తో కలసి ఆశ్రమంలో నూతనంగా నిర్మించిన ఆదినాథ్ శ్రీగురు మహావతార్ బాబాజీ ఆలయాన్ని ప్రారంభించారు. అలాగే ఆలయంలో ప్రతిష్ఠించిన బాబాజీ విగ్రహాన్ని ఆవిష్కరించి కేంద్ర మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల మంత్రోచ్చారణ, కేరళావాయిద్యాల నడుమ కార్యాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. కేంద్రమంత్రి గడ్కరి హెలికాప్టర్‌లో తిరుపతి నుంచి బయలుదేరి మధ్యాహ్నం 2:40 గంటలకు మదనపల్లెకు చేరుకున్నారు. అక్కడి నుంచి ఆశ్రమానికి చేరుకున్న గడ్కరీ ఆశ్రమంలో గంటన్నరకు పైగా విశ్రాంతి తీసుకుని, తర్వాత కార్యక్రమం నిర్వహిస్తున్న ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు ఆలయాన్ని, ఆలయంలోని బాబాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి ప్రముఖులు, అధికారులు, శ్రీఎం శిష్యులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణాశాఖమంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా, టీడీపీ తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీరామ్‌చినబాబు, బీజేపీ నేత చల్లపల్లె నరసింహారెడ్డి తదితరులు చిప్పిలి సమీపంలోని మైదానంలోని హెలిప్యాడ్‌కు చేరుకుని కేంద్రమంత్రికి స్వాగతం పలికారు. అలాగే అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌లు పుష్పగుచ్ఛంతో కేంద్రమంత్రికి స్వాగతం పలికారు. 5:30 గంటలకు హెలికాప్టర్‌లో తిరుపతికి బయలుదేరి వెళ్లారు.

జిల్లా ప్రాజెక్టులు పూర్తి చేయండి

- గడ్కరీకి రవాణా మంత్రి మండిపల్లి వినతి

మదనపల్లె, జూలై 17: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జిల్లాలో జరుగుతున్న వివిధ జాతీయ రహదారుల ప్రాజెక్టులు పూర్తి చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కోరారు. బుధవారం మదనపల్లెకు విచ్చేసిన కేంద్ర మంత్రికి చిప్పిలి సమీపంలోని హెలిప్యాడ్‌లో ఘనస్వాగతం పలికిన మండిపల్లి వివిధ అంశాలపై కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేశారు. ఇందులో రాజంపేట-రాయచోటి, రాయచోటి-కదిరి రాష్ట్ర రహదారి నుంచి జాతీయ రహదారిగా 135 కి.మీ. మార్చు చేయాలని కోరారు. ఏపీలో రాజంపేట-రాయచోటి, రాయచోటి-కదిరి రహదారి చాలా ముఖ్యమైన స్టేట్ హైవే అని తెలిపారు. ఈ రహదారి మూడు జాతీయ రహదారులతో అనుసంధానం అవుతుందని వినతిపత్రంలో వివరించారు. అలాగే రాజంపేట వద్ద ఎన్‌హెచ్-716 (రేణిగుంట-కడప రోడ్డు), రాయచోటి వద్ద ఎన్‌హెచ్-40 (కర్నూలు-చిత్తూరు-రాణిపేటరోడ్), కదిరి వద్ద ఎన్‌హెచ్-42 (ఉరవకొండ-అనంతపురం-కదిరి-మదనపల్లె-కృష్ణగిరి రోడ్డు), ఎన్‌హెచ్-40కి సంబంధించి కడప-రాయచోటి రోడ్ నుంచి రెండు లేన్ల నుంచి నాలుగులేన్లకు విస్తరించాలని కోరారు. అలాగే సీఆర్‌ఎఫ్ పథకం కింద రూ.109.70 కోట్ల అంచనా వ్యయంతో 72.180 కి.మి. ఆరు లేన్ల విస్తరణ పనులు చేపట్టాలని కేంద్ర మంత్రిని కోరారు. అలాగే జిల్లాలో మౌలిక రంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్రమంత్రికి ఇచ్చిన వినతిపత్రంలో మంత్రి మండిపల్లి కోరారు.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

కబ్జా భూములు స్వాధీనం చేసుకుంటాం

- అక్రమ కేసుల నుంచి కార్యకర్తలకు విముక్తి
- ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణం
- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

మదనపల్లె, జూలై 17: అయిదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు కబ్జా చేసిన, దౌర్జన్యంగా ఆక్రమించిన భూములను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుంటుందని రాష్ట్ర క్రీడలు, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్‌గడ్కరీకి స్వాగతం పలికేందుకు బుధవారం మదనపల్లెకు విచ్చేసిన మంత్రి..స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో మీడియాతో మాట్లాడారు. రికార్డులను ట్యాంపరింగ్ చేసి, అధికారులను బెదిరించి ప్రభుత్వ భూములను పెద్దిరెడ్డి తన అనుయాయులకు కట్టబెట్టారని తెలిపారు. అలాగే ప్రైవేటు భూములను కూడా బలవంతంగా లాక్కున్నారని అలాంటి బాధితులు కలెక్టర్ లేదా స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తే ప్రభుత్వం చర్యలు తీసుకుని వారి భూమి తిరిగి వారికి అప్పగిస్తుందని స్పష్టం చేశారు. మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు నియోజకవర్గాల్లో పెద్దిరెడ్డి కుటుంబం ఎన్ని ఎకరాలు ఆక్రమించిందో ప్రతి ఒక్కరికీ తెలుసునని, దీనిని ప్రభుత్వం ఎట్టి పరిస్థితిలోనూ వదలదన్నారు. అంగళ్లు, పుంగనూరు అల్లర కేసులో అక్రమంగా కేసులు ఎదుర్కొంటున్న పార్టీ శ్రేణులకు విముక్తి కలిగిస్తామని, ఈ మేరకు డీజీపీతో మాట్లాడినట్లు మంత్రి తెలిపారు. ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాలో పెండింగ్‌లో ఉన్న హంద్రీ-నీవా, గాలేరు-నగరి ప్రాజెక్టు పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించిందన్నారు. కడప, చిత్తూరు జిల్లాలో భూఆక్రమణలపై సీఎం చంద్రబాబునాయుడు శ్వేతపత్రం విడుదల చేశారని, ఇందులో 1.75 లక్షల ఎకరాలు, రూ.36 వేల కోట్లు విలువ చేసే ప్రభుత్వ, ప్రైవేటు భూములను వైసీపీ నాయకులు ఆక్రమించినట్లు ఈ సందర్భంగా గుర్తు చేశారు. భూదోపిడీకి పాల్పడిన అధికారులు, రాజకీయ నాయకుల పేర్లను బయట పెట్టేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు మంత్రి ప్రకటించారు. కడప, చిత్తూరు జిల్లాల్లో ఎంతోమంది టీడీపీ నాయకులు, కార్యకర్తలపై పెద్దిరెడ్డి కుటుంబం అక్రమంగా కేసులు పెడితే, ఊర్లు వదిలి వెళ్లిపోయారని, వారు చేసినట్లు మేం ప్రస్తుతం వారిపై దాడులు, దౌర్జన్యాలు చేయడం లేదన్నారు. అయిదేళ్లలో వారు చేసిన పాపాలు, అక్రమాలే వారిని నీడలా వెంటాడుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో వాళ్లే ఇంట్లో నుంచి బయటకు వచ్చేందుకు భయపడి ప్రెస్‌మీట్లు పెడుతున్నట్లు చెప్పారు. సమావేశంలో తెలుగుయువత రాష్ట్రఅధ్యక్షుడు జి.శ్రీరాంచినబాబు, తంబళ్లపల్లె, పుంగనూరు డి.జయచంద్రారెడ్డి, చల్లా బాబురెడ్డి, టీడీపీ సీనియర్ నేత రాటకొండ బాబురెడ్డి, వై.దొరస్వామినాయుడు పాల్గొన్నారు.

ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణం

నిమ్మనపల్లి, జూలై 17: రాష్ట్ర మహిళలకు ఆగస్టు 15వ తేదీ నుంచి ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశ పెట్టనున్నట్లు ఏపీ రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక బస్టాండు కూడలిలో టీడీపీ కార్యకర్తలు నాయకులు బాణాసంచా పేల్చి ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని మహిళలకు ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి విధివిధానాలు పూర్తయ్యాయని తెలిపారు. ఎన్నికలలో టీడీపీ కోసం ఎంతో కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు ఇచ్చి వారిని ఆదుకొంటామని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాంచినబాబు, పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ, నాయకులు మునిరత్నం, మల్లికార్జున, చెంద్రాయుడు, విజయ్, రామకృష్ణ, మురళి పాల్గొన్నారు.

నేర రహిత జిల్లాగా చేస్తాం

- ఎర్రచందనం స్మగ్లింగ్‌ను అరికడతాం
- ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన విద్యాసాగర్‌నాయుడు



బాధ్యతలు చేపడుతున్న విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, జూలై 17: జిల్లాను అందరి సహకారంతో నేరరహిత జిల్లాగా చేసేందుకు కృషి చేస్తామని, జిల్లాలో ఎర్రచందనం స్మగ్లింగ్‌ను అరికట్టేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. నూతన ఎస్పీగా విద్యాసాగర్‌నాయుడు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ముందుగా ఆయన జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సతీసమేతంగా పూజలు నిర్వహించి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ తాను గతంలో చిత్తూరు, తిరుపతి ప్రాంతాల్లో పనిచేశానని, అన్నమయ్య జిల్లాపై సగం వరకు అవగాహన ఉందన్నారు. ముఖ్యంగా జిల్లాలో ఎర్రచందనం అక్రమ రవాణాతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. అన్నమయ్య జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టడం చాలా సంతోషంగా ఉందని, గతంలో చిత్తూరు జిల్లాలో తిరుపతి అర్బన్ పరిధిలో సబ్ జాయింట్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించినట్లు తెలిపారు. జీవనోపాధి కోసం వలసలకు వెళ్లి ఇబ్బందులు పడే వారికి పోలీసుల నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు అందచేస్తామని తెలిపారు. చిన్న చిన్న తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోతున్నారని, సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణా జరగకుండా చెక్‌పోస్టుల వద్ద తనిఖీలతో పాటు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటామని చెప్పారు. మీడియా కూడా సమాజంలో ప్రత్యేకమైన పాత్ర పోషిస్తుందని, ఏవైనా సమస్యలు మీడియా దృష్టికి వచ్చినప్పుడు వెంటనే మాకు సమాచారం అందిస్తే సమస్య జటిలం కాకుండా సున్నితంగా పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాలను పరిశీలించి అసాంఘీక కార్యకలాపాలతో పాటు ఎర్రచందనం అక్రమ రవాణా, జూదం తదితర వాటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ డాక్టర్ వీబీ రాజ్‌కమల్, స్పెషల్ బ్రాంచ్ సీఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మొహర్రం మహోత్సవం

చిన్నమండెం, జూలై 17: జిల్లావ్యాప్తంగా బుధవారం మొహర్రం ఉత్సవాలు వైభవంగా జరిగాయి. చిన్నమండెంలోని మఖాన్ వద్ద ఆరు రోజులుగా సాగుతున్న మొహరం ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి కడప పెద్ద దర్గా పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బుధవారం తెల్లవారుజామున పురవీధుల్లో గంధపు పీరు మెరమణి తీర్చారు. సాయంత్రం 5 గంటల నుంచి హుస్సేని ఇమామ్‌పీరు, హిమాన్‌ఖాసీం పీరు, హుస్సేని ఇ మామ్ పీరు ఇలా మొత్తం 32 రకాల పీర్లను మఖాన్ వద్ద నుంచి సంప్రదా య మంగళ వాయిద్యాల నడుమ సంతోష్ వరకు మెరమణి తీసుకెళ్లి అక్కడ జల్దీలో కలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.





చిట్వేలిలో పీర్లను గ్రామోత్సవంగా ఏటికి సాగనంపుతున్న భక్తులు

దొరకునా.. ఇటువంటి సేవ

- హనుమంత వాహనంపై సౌమ్యనాథుడు

నందలూరు, జూలై 17: దొరకునా.. ఇటువంటి సేవ అని హనుమంతుడు తన భుజస్కందాలపై శ్రీరామచంద్ర అవతారంలలో సౌమ్యనాథస్వామిని పురవీధులలో ఊరేగించారు. సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి హనుమంత వాహన సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు శ్రీరామచంద్రమూర్తి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ గ్రామోత్సవం నందలూరు, పేటగడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మీదుగా బస్టాండ్ కూడలి వరకు కొనసాగింది. సాయంత్రం డోలోత్సవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ఉత్సవమూర్తులకు అభిషేకం, స్నపన తిరుమంజనం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిలో శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథస్వామి మాఢవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం సౌమ్యనాథస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా 6వ రోజు గురువారం ఉదయం శేషవాహన గ్రామోత్సవం, తిరుమంజనం, రాత్రి గరుడ వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



హనుమంత వాహనంపై సౌమ్యనాథస్వామి

భవనం జరిగిపోయిందోచ్..!

- 200 అడుగులు పక్కకు.. జరిపేందుకు ఐదు నెలల సమయం
- చెక్కుచెదరని భవనం.. జర్మన్ టెక్నాలజీ విజయవంతం



భవనాన్ని పక్కకు జరుపుతున్న దృశ్యం (ఫైల్)

ములకలచెరువు, జులై 17: అవును....మీరు వింటున్నది నిజమే...భవనం పక్కకు జరిగింది. ఎంతో కొంత కాదు ఏకంగా 200 అడుగులు. జర్మన్ టెక్నాలజీని వినియోగించి భారీ జాకీల సహాయంతో పక్కకు జరిపారు. వివరాల్లోకి వెళితే...ములకలచెరువు మండలం బురకాయలకోట పంచాయతీ మార్కిరివారిపల్లెకు చెందిన బి.రామక్రిష్ణారెడ్డి బురకాయలకోటలో స్థలం కొనుగోలు చేసి మూడంతస్థుల భవనాన్ని నిర్మించారు. స్థలం కొనుగోలుతో పాటు ఇంటి నిర్మాణం కోసం రూ.కోటి వరకు ఖర్చు వచ్చింది. ఈ క్రమంలో ములకలచెరువు నుంచి మదనపల్లె వరకు ఉన్న ముంబాయి-చెన్నై జాతీయ రహదారి పనుల్లో భాగంగా బురకాయలకోటకు బైపాస్ రోడ్డు మంజూరై పనులు కూడా ముగింపు దశకు చేరుకున్నాయి. కొత్తగా వేసిన బైపాస్ రోడ్డుకు ఈ భవనం అడ్డు వచ్చింది. అడ్డుగా ఉన్న భవనాన్ని పడగొట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఇంటి యజమాని ఖాతాలోకి రూ.84.56 లక్షలు నష్ట పరిహారం జమ చేసింది. ఎంతో ఆశతో కట్టుకున్న ఇల్లు పడగొట్టేందుకు మనసొప్పలేదు. దీంతో తెలిసిన వారి సూచనల మేరకు తమిళనాడు రాష్ట్రం చెన్నైకి చెందిన జేజే బాబు లిఫ్టింగ్, షిఫ్టింగ్ సంస్థను సంప్రదించి జర్మన్ సాంకేతికతతో ఇంటికి ఎలాంటి నష్టం జరగకుండా ఎంత దూరమైనా జరిపి యధాతధంగా పెట్టవచ్చని సంస్థ యజమాని చెప్పడంతో అందుకు అంగీకరించి రూ.15 లక్షలు చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ముందుకు జరిపేందుకు ఇంటి సమీపంలో ఖాళీగా ఉన్న కుంట స్థలాన్ని రూ.16 లక్షలు పెట్టి కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో చెన్నైకి చెందిన సంస్థ సిబ్బంది ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో పనులు ప్రారంభించారు. ఇంటి చుట్టూ గొయ్యి తవ్వి గోడలు, బీమ్‌ల కింద లిఫ్టింగ్ జాకీలు అమర్చి కొంచెం కొంచెంగా పైకి లేపుతూ వచ్చారు. ఎక్కడా పగుళ్లు రాకుండా జాగ్రత్తగా మూడు అడుగులుపైకి లేపారు. దీనికి గానూ 150కి పైగా భారీ జాకీలు వినియోగించారు. తరువాత ఈ జాకీలను తీసేసి ముందుకు కదిలే చక్రాల జాకీలను ఇంటి కింద అమర్చారు. ఇంటి వెనుక గోడకు జాకీలు పెట్టి వాటి సహాయంతో ముందుకు జరిపారు. భవనం మొత్తం 200 అడుగులు పక్కకు జరిపేందుకు ఐదు నెలల సమయం పట్టింది. 200 అడుగుల దూరంలో పునాది వేసి భవనాన్ని జరుపుకుంటూ పోతూ దానిపై ఉంచారు. ఈ ప్రక్రియ మొత్తం విజయవంతమైంది. భవనం చెక్కుచెదరకుండా జరపడం చూసిన స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.



200 అడుగులు జరిగిన భవనం

ఎస్కేయూలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

● సీపీఆర్‌తో ప్రాణం నిలిపిన సహ విద్యార్థినులు



సర్వజన వైద్యశాలలో మౌనికకు చికిత్స చేస్తున్న వైద్యులు

అనంతపురం సెంట్రల్, జూలై 17: ఎస్కేయూ విద్యార్థిని మౌనిక బుధవారం ఆత్మహత్యకు యత్నించింది. కడప జిల్లా పులివెందులకు చెందిన మౌనిక, ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. వర్సిటీ బాలికల వసతి గృహంలోని తన గదిలో నైలాన్ తాడుతో ఉరివేసుకుంది. సహ విద్యార్థినులు సకాలంలో గమనించి సిబ్బంది సాయంతో రక్షించారు. వెంటనే సీపీఆర్ చేసి ప్రాణం పోశారు. అక్కడి నుంచి అనంతపురం సర్వజన వైద్యశాలకు తరలించారు. విద్యార్థిని పరిస్థితి నిల కడగా ఉందని వైద్యులు తెలిపారు. వర్సిటీ రెక్టార్ వెంకటనాయుడు, డిప్యూటీ వార్డెన్‌లు అనిత, శ్రీరాములు, ఎంబీఏ ప్రొఫెసర్‌లు ప్రభాకర్, మురళీకృష్ణ ఆసు పత్రికి చేరుకుని విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. ఇండస్ట్రి యల్ టూర్‌లో భాగంగా ఈనెల 10 నుంచి 16 వరకు కేరళ, తమిళనాడులోని పలు పరిశ్రమలను వర్సిటీ ఎంబీఏ విద్యార్థులు సందర్శించి వచ్చారు. ఆ సమ యంలో సహ విద్యార్థులతో మౌనిక ఆనందంగా గడిపారని వర్సిటీ అధికారులు తెలిపారు. హాస్టల్ గదిలోని ఇతర విద్యార్థినులు అల్పాహారం కోసం వెళ్లిన తరు వాత, ఉదయం 9.30 గంటల సమయంలో మౌనిక ఆత్మహత్యకు యత్నించిందని వారు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సర్వజన వైద్యశాలకు వచ్చి బోరున విలపించారు. మౌనిక ఆత్మహత్యకు యత్నించడానికి కారణాలు ఏమిటో తెలియరాలేదు. విద్యార్థిని కోలుకున్నాక విషయం తెలుస్తుందని వర్సిటీ వర్గాలు అన్నాయి. విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించడానికి కారణాలు ఏమిటో ఇంకా తెలియదని, అందుకే కేసు నమోదు చేయలేదని ఇటుకలపల్లి సీఐ నరేంద్ర నాథ్‌రెడ్డి తెలిపారు.

ప్రాణం పోశారు..

మౌనిక ఉరితాడుకు వేలాడుతుండగా గమనించిన సహ విద్యార్థినులు కేకలు వేసి హాస్టల్ సిబ్బందిని పిలిచారు. వారి సాయంతో తలుపులు బద్దలు కొట్టి లోపలికి వెళ్లారు. మౌనికను కిందికి దించి.. కొన ఊపిరితో ఉన్నట్లు గుర్తించారు. శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడుతుండటంతో సమయస్ఫూర్తి ప్రదర్శించారు. కింద పడుకోబెట్టి గుండె భాగంలో ఒత్తుతూ.. నోటితో ఊపిరి ఊదారు. దీంతో మౌనిక కళ్లు తెరిచింది. ఆ వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఉరి కారణంగా మెదడుకు ప్రాణవాయువు అందడం కష్టమౌతుందని, మౌనికకు సహ విద్యార్థినులు సీపీఆర్ చేయకపోయి ఉంటే ప్రాణాపాయం ఏర్పడేదని వైద్యులు అన్నారు. ప్రస్తుతానికి ప్రాణాపాయం లేదని, మరో 24 గంటలపాటు పరిశీలించాల్సి ఉందని అన్నారు.

హత్యకేసులో నిందితుడి అరెస్టు



అన్వర్‌బాషను అరెస్టు వివరాలు తెలియజేస్తున్న డీఎస్పీ మురళీధర్

ప్రొద్దుటూరు క్రైం, జూలై 17: సోములవారిపల్లె పంచాయతీ పరిధిలోని పాలకేంద్రం వెనుక వైపున ఈ నెల 12వ తేదీ రిజ ర్వు ఫారెస్టులో భార్యను హత్య చేసిన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ప్రొద్దుటూరు డీఎస్పీ మురళీధర్ తెలిపారు. ఇందుకు సంబంధించి బుధవా రం స్థానిక రూరల్ పోలీస్‌స్టేష న్‌లో వివరాలు వెల్లడించారు. పట్టణంలోని అమృతానగర్‌కు చెందిన షేక్ అన్వర్‌బాష తన భార్య రేష్మాపై అ నుమానంతో విడాకులు ఇచ్చి రెండో పెళ్లి చేసుకోవాలని భావించాడు. ఆమె వి డాకులు ఇవ్వకపోవడంతో అడ్డుతొలగించుకోవాలని నిర్ణయించుకున్నాడు. పథకం ప్రకారం ఈ నెల 12వ తేదీ పెన్నానగర్ పార్క్‌కు పోదామని పిలుచుకుపోయి, అక్కడి నుంచి పాలకేంద్రం వెనుకవైపున ఉన్న ఇసుకదిన్నెలలోకి తీసుకెళ్లి ఆమె గొంతు నులిమి హత్య చేశాడు. ఈ మేరకు నిందితుడు అన్వర్‌బాష నేరం అంగీకరండంతో అతన్ని అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. అతని వద్ద నుంచి ఒక మోటారు సైకిల్, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సమావేశంలో సీఐ రమణారెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

పథకం ప్రకారం భర్తను హత్య చేయించిన భార్య

మైలవరం, జూలై 17 : మండల పరిధిలోని వద్దిరాల గ్రామ పొలాల్లో జూన్ 21వ తేదీ అనుమానస్పదస్థితిలో మృతి చెందిన దూదేకుల హుస్సేనయ్య(34)ను అతని భార్యే పథకం ప్రకారం హత్య చేయించిందని జమ్మలమడుగు రూరల్ సీఐ గోపాల్ రెడ్డి తెలిపారు. సీఐ వివరాల మేరకు... పెద్దముడియం గ్రామానికి చెందిన హుస్సేనయ్య మైలవరం మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామ సమీ పంలోని కంకర మిషన్‌లో పని చేస్తుండేవాడు. కాగా, హుస్సేనయ్య భార్య కరీ మూన్ అదే గ్రామానికి చెందిన కుమ్మర వెంకట సుబ్రమణ్యంతో వివాహేతర సంబంధం ఉండేది. ఈ విషయం హుస్సేనయ్యకు తెలిసిపోవడంతో అతన్ని అడ్డుతొలగించుకోవాలనే ఉద్దేశ్యంతో పథకం ప్రకారం వద్దిరాల గ్రామానికి హుస్సే నయ్యను రప్పించి.. మందు తాపించి మద్యం మత్తులో సుబ్రమణ్యం గొంతు నులిపి చంపారు. దీనిపై గత నెల 21న తలమంచిపట్నం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులోని నిందితులు ఇద్దరిని అరెస్టు చేసి బుధవారం జమ్మలమడుగు కోర్టులో హాజరు పరిచి జైలుకు పంపించామని సీఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

జమ్మలమడుగు, జూలై 17: జమ్మలమడుగు మండలంలోని మోరగుడి గ్రామం కోవెలకుంట్ల రోడ్డులో ఏవీఎన్ అగ్రోటెక్ పప్పుల ఫ్యాక్టరీ వద్ద బావిలో పడి బుధవారం రోహిత్‌మోరే (20) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. మధ్రప్రదేశ్‌లోని కాండవాజిల్లా నర్మదాన గర్‌కు చెందిన రోహిత్‌మోరే పప్పుల ఫ్యాక్టరీలో కూలి పనిచేస్తున్నాడు. గత కొం త కాలంగా మృతుడితోపాటు అతని బంధువులు అక్కడ కూలి పని చేసుకు ంటూ జీవిస్తున్నారు. అయితే జరిగిన ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియరాలేదు. మృతుడి మేనమామ అజయ్ గద్వాల్ ఫిర్యాదు మేరకు కేసు న మోదు చేసి విచారణ చేస్తున్నట్లు అర్బన్ పోలీసులు తెలిపారు. అయితే పప్పుల ఫ్యాక్టరీ వద్ద చుట్టూ కూలీలకు ఏమైనా సమస్యలున్నాయా, మృతుడికి ఎవరైనా ఇబ్బంది కలిగించారా అన్న అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

‘పట్టు’ తప్పిన సాగు

● కనుమరగువుతున్న మల్బరీ పంట

● 3 వేల ఎకరాలు నుంచి 50 ఎకరాలకు పడిపోయిన వైనం

● ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తున్నా.. గిట్టుబాటు ధరల్లేక ముందుకు రాని రైతులు

● పంటసాగు మానేసిన రైతులు



నిరుపయోగంగా ఉన్న చంద్రికలు



గద్దగుండ్లరాచపల్లెలో వదిలేసిన మల్బరీపంట



మల్బరీ పంటను తొలగిస్తున్న దృశ్యం

లక్కిరెడ్డిపల్లె, జూలై 17: ఒకప్పుడు లక్కిరెడ్డిపల్లె తాలూకా పరిధిలో మల్బరీ పంటను విస్తారంగా సాగుచేసేవారు. ఈ ప్రాంతంలో ఎక్కు వగా మెట్ట ప్రాంతం కావడం.. ఇక్కడ వర్షాలు పడితేగాని పంటలు సాగయ్యేవికావు. ఈనేపధ్యంలో 1990 సంవత్సరంలో ఈ ప్రాంతంలో బావులు, చెరువుల కింద మల్బరీ సాగుచేపట్టారు. అప్పట్లో మంచి దిగుబడులు, లాభాలు రావడంతో రైతులు పంటసాగుకు ఆసక్తి కనబరిచారు. దీంతో లక్కిరెడ్డిపల్లె డివిజన్ పరిధిలోని రామాపురం, లక్కిరెడ్డిపల్లె, గాలివీడు, చక్రాయపేట, వీరబల్లి మండలాలల్లో దాదాపు 3వేల ఎకరాలల్లో రైతులు మల్బరీ పంట సాగు చేశారు. ఆ తర్వాత కరువు సంభవించడం, గిట్టుబాటు ధరలు లేకపోవడంతో పంటసాగు క్రమంగా తగ్గుతూ వచ్చింది.

2002 నుంచి మల్బరీ పంటసాగు క్రమంగా తగ్గు ముఖం పట్టింది. దీనికితోడు ఐదేళ్లు వర్షాలు కురవక బోర్లు, బావుల్లో నీళ్లు అడుగంటి పోవడంతో సాగుచేసిన పంట ఎండిపోయి రైతులు తీవ్రం గా నష్టపోయారు. దీంతో రైతున్నలకు పట్టుసాగుపై పట్టు తప్పింది. ఈ నేపథ్యంలో 2009 నుంచి క్రమంగా అన్ని మండలాలల్లో మల్బరీ సాగు తగ్గుముఖం పడుతూ వేల ఎకరాల నుంచి వందల ఎకరాలకు చేరింది. కాగా, 2012 నుంచి మల్బరీపంట సాగు పెంచేందుకు రైతు లకు అన్ని విధాలా ప్రభుత్వం తోడ్పాటు అందించింది. పంట సాగు చేసుకునే రైతులకు రూ.30వేలు ఇస్తోంది. సబ్సిడీతో ఆకు మేపుకోవ డా నికి షెడ్లు, తట్టలు, మొక్కలు, మొక్కలు పెంచడానికి ఉచితంగా కూలీ డబ్బులు కూడా ప్రభుత్వం అందిస్తోంది. అంతేకాకుండా షెడ్ ఏర్పాటు చేసుకుంటే పెద్ద షెడ్డుకు 2,50,000 ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వగా.. రైతు 50,000 పెట్టుకోవాలి. మొత్తం 3 లక్షలు షెడ్డుకు, చిన్న షెడ్డుకు రూ.2లక్షలు ప్రభుత్వం అందిస్తోంది. అయినా రైతులు ముం దుకు రావడం లేదని పట్టుపరిశ్రమశాఖ అధికారులు చెబుతున్నారు. కాగా, లక్కిరెడ్డిపల్లె మండలంలోని పందిళ్లపల్లె గ్రామానికి చెందిన శివ అనే రైతు రూ.10లక్షలు ఖర్చు పెట్టి 20 ఎకరాలల్లో మల్బరీపంట సాగు చేసేవారు. కానీ ఏ రోజు కూడా లాభాలు రాలేదంటున్నారు. అష్టకష్టాలు పడి మల్బరీపంట సాగుచేసి పట్టుగూళ్లను మార్కెట్‌కు తీసుకెళితే తెల్లగూళ్లకు కిలో రూ.450, పచ్చగూళ్లకు కిలో రూ.300 ధర పలుకుతోంది. 2010 నుంచి ఇదే రేటు నడుస్తోంది. ప్రభుత్వం ప్రోత్సాహం కింద కిలోకి రూ.50లు ఇస్తున్నా గిట్టుబాటు కావడం లేదని చాలా మంది రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పంటను సాగుచేయడం మానేశామని....పట్టుగూళ్లకు రేటు పెంచితే తప్ప మల్బరీ పంట సాగుచేసే పరిస్థితి లేదని చెబుతున్నారు. ఇప్పటి కైనా ప్రభుత్వం ఆదిశగా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

గిట్టుబాటు కాకపోవడంతో..



మాకు 5 ఎకరాలు భూమి ఉంది. 3 ఎకరాలలో మల్బరీపంట సాగు చేసి అప్పట్లో మంచి దిగుడబడులతో లాభాలు వచ్చాయి. 1985 నుంచి పంట మొదలు పెట్టి క్రమం తప్పకుండా మల్బరీపంట సాగుచేశాం. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పట్టుగూళ్లకు రేట్లు పెరగడం లేదు. అప్పట్లో కిలో రూ.300 రేటు ఉండేది. ప్రస్తుతం పచ్చగూళ్లకు రూ.350, తెల్లగూళ్లకు రూ.450 ఉంది. ధరలు గిట్టుబాటు కాకపోవడంతో మల్బరీ పంట సాగు చేపట్టడం లేదు.

-బొంతలపల్లె వెంకటరమణ, బూడిదగుంటపల్లె

నష్టాలు భరించలేక..



20 సంవత్సరాలుగా మల్బరీపంట సాగుచేశాం. అరకొరగా లాభాలు వచ్చేవి. అప్పట్లో రూ.10 లక్షలు ఖర్చుపెట్టి 7 ఎకరాల్లో మల్బరీపంట సాగుచేశాం. ఒక్క ఏడాది కూడా లాభాలు రాలేదు. చేసిన అప్పులు తీరలేదు. రూ.6లక్షలు ఖర్చు పెట్టి రెండు షెడ్లు ఏర్పాటు చేశాం. ఇంత వరకు కనీసం ఖర్చులు కూడా రాలేదు. మల్బరీపంటను తొలగించి ఏదైనా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు ఏడు ఎకరాలు పంటను దున్నేస్తున్నాం.

-ఆనందరాజు, గద్దగుండ్లరాచపల్లె, లక్కిరెడ్డిపల్లె

రైతులకు అవగాహన కల్పిస్తున్నా...

మల్బరీపంట సాగుపై అన్ని విధాల రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. అయినా పంట సాగుచేసేందుకు ముందుకు రావడం లేదు. కూలీలు దొరకడం లేదని.. వర్షాలు సక్రమంగా కురవడంలేదని రైతులు అంటున్నారు. ప్రభుత్వం మల్బరీపంట సాగుచేసే ప్రతి రైతుకు పోత్సాహం అందించడంతో పాటు అన్ని విధాల అధికారులు అందు బాటులో ఉన్నా ఎవరు ముందుకు రావడం లేదు.

-రవీంద్ర, సిరికల్చర్ అధికారి, లక్కిరెడ్డిపల్లె

పుష్పగిరి క్షేత్రాన్ని దర్శించుకున్న జిల్లా ప్రధాన జడ్జి



జడ్జి కుటుంబాన్ని ఆశీర్వదిస్తున్న ఆలయ అర్చకులు

వల్లూరు, జూలై 17: పుష్పగిరి క్షేత్రాన్ని జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. జడ్జి ఆలయంలో రావడంతో అర్చకులు సుమంత్ స్వామి ఆలయ మర్యాదలతో స్వాగ తించారు. అనంతరం కొండమీద గల రాజ్యలక్ష్మీ సమేత, చెన్న కేశవ స్వాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంతాన మల్లేశ్వ రునికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయ బద్దంగా వారిని సత్కరించారు. పుష్పగిరి క్షేత్ర విశిష్టతను వారికి వివరించారు. వీరి వెంట ఆలయ సిబ్బంది తది తరులు పాల్గొన్నారు.

పుష్పగిరి ప్రదర్శనకు తాళ్ళపాక వంశస్తుడు రాక

ఈనెల 21వ తేదీ పౌర్ణమి సందర్భంగా పుష్పగిరి ప్రదర్శన చేపడతారు. అందులో భాగంగానే తాళ్ళపాక అన్నమాచార్య వంశ స్తుడు హరినారాయణచార్యులు ఈ గిరి ప్రదర్శనలో పాల్గొంటా రని కార్యనిర్వాహకులు తెలియజేశారు. ప్రతి పౌర్ణమిలాగానే ఈ ఆషాఢ పౌర్ణమికి ఎంతో విశిష్టత ఉందని.. గిరి ప్రదర్శన చేస్తే సకల శుభాలు కలుగు తాయని భక్తుల నమ్మకం. ఈ గిరి ప్రదర్శనలో పాల్గొనేందుకు భక్తులు విరి విరిగా పాల్గొంటున్నారు. గిరి ప్రదర్శన అనంతరం హరినారా యణస్వామి లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తారని తెలియజేశారు.

కడప బుల్లోడికి ఐదు బంగారు పతకాలు

రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్‌లో సత్తా చాటిన వైనం



స్విమ్మింగ్‌లో సత్తాచాటిన త్రిభువన్‌రెడ్డి

కడప (స్పోర్ట్స్) జూలై 17: రాష్ట్ర స్థాయి 40వ సబ్‌జూని యర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్ స్విమ్మింగ్ పోటీల్లో కడపకు చెందిన బిక్కా త్రిభువన్‌రెడ్డి ఐదు బంగారు పతకాలు సాధించడమేకాక వ్యక్తిగత విభాగంలోనూ రాణిం చి సత్తా చాటాడు. కర్నూలు జిల్లా ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 13, 14, తేదీల్లో కర్నూలు డీఎస్‌ఏ స్విమ్మింగ్ పూల్‌లో రాష్ట్రస్థాయి ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్ స్విమ్మింగ్ పోటీలు నిర్వహించారు. ఇందు లో కడపకు చెందిన త్రిభువన్ రెడ్డి గ్రూప్-3 విభాగంలో సత్తా చాటాడు. 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్ల ఫ్రీ స్టైల్ విభాగం, 50 మీటర్లు, 100 మీటర్ల బటర్‌ఫ్లై విభాగంలో సైతం పాల్గొని ఐదుకు ఐదు బంగారు పతకాలు సాధించాడు. వ్యక్తిగత విభాగంలో సైతం రాణించి సత్తా చాటాడు. దీంతో ఆగస్టు 6 నుంచి 11వ తేదీ వరకూ భువనేశ్వర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలో పాల్గొనే అవకాశం దక్కినట్లు కోచ్‌లు సతీష్‌కుమార్, రాజేంద్ర, యోగేశ్వరరెడ్డి, ధనుం జయరెడ్డి, జిల్లా కార్యదర్శి రాజశేఖరరెడ్డి, స్పోర్ట్స్ స్కూల్ స్పెషల్ ఆఫీసర్ కె. జనార్ధనరెడ్డి తెలిపారు.

పిండ మార్పిడి విధానంతో జెర్సీ ఆవుకు ఒంగోలు దూడ జననం



రైల్వేకోడూరు, జూలై 17: పిండ మార్పి విధానంతో జెర్సీ ఆవుకు మంగళవారం రాత్రి ఒంగోలు దూడ జన్మనిచ్చింది. రాష్ట్రీయ గోకు ల్ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహిం చిన ఈ ప్రయోగం విజయవంతం అయింది. బుధవారం శెట్టిగుంట పశువైద్యులు ప్రతాప్ అందించిన వివరాల మేరకు.... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న పిండ మార్పిడి విధానంతో రైల్వేకోడూరు మండలంలోని శెట్టిగుంట పశువై ద్యశాల పరిధిలోని జ్యోతి కాలనీకి చెందిన కుళాయి లక్ష్మీదేవి అనే పాడి రైతుకు చెందిన జెర్సీ ఆవుకు పిండ మార్పిడిలో భాగంగా ఒంగోలు జాతి పిండాన్ని 2023 సంవత్సరం సెప్టెంబరు 29న ప్రవేశ పెట్టడం జరిగింది. గత డిసెంబర్‌లో ఆవు చూలాల నిర్ధారణ చేశారు. అత్యంత ఒంగోలు జాతి కోడెదూడను జెర్సీ ఆవు జన్మనిచ్చింది. పిండ మార్పిడి విధానంలో గుంటూ రుకు చెందిన లామ్‌ఫామ్ డాక్టర్ ముత్తారావు, రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ అదనపు సీఈవో డాక్టర్ రజనీకుమారి, డాక్టర్ శ్రీమన్నారాయణ, డాక్టర్ శ్రీకాంత్, కడప జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈవో డాక్టర్ రమేష్, వీఏఎస్ డాక్టర్ శివరామిరెడ్డి ముఖ్య పాత్ర పోషించారన్నారు. పిండ మార్పిడి విధానం ద్వారా అత్యంత ఉత్తమ జెన్యు లక్షణాలు కల్గి ఉన్న పశువులను త్వరితగతిన అభివృద్ధి చేయడానికి ఉపయోగపడుతుందన్నారు.

అన్నమాచార్య కళాశాలలో వందశాతం సీట్ల భర్తీ

సికెదిన్నె, జూలై 17: కడప అన్నమాచార్య ఇంజనీఇంగ్ కళాశాలలో వంద శాతం సీట్ల భర్తీ అయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సుధాకర్‌రెడ్డితెలిపారు. ఏపీఈఏపీసెట్ సీ ట్ల కేటాయింపులో బుధవారం విడుదల చే సిన లిస్టులో కడప అన్నమాచార్య ఇంజనీ రింగ్ కళాశాల వంద శాతం సీట్లు భర్తీ కా వడం పట్ల విద్యాసంస్థల అధినేత గంగిరెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. తమ విద్యాసంస్థల మీద ఎంతో నమ్మకంతో కళాశాలలోని కంప్యూటర్ సైన్స్, సీఎస్‌ఈ, ఇంటలిజెన్స్, లెసన్ లర్నింగ్, ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్, డేటా సైన్స్, ఎలక్ట్రానిక్ కమ్యూ నికేషన్స్‌లో వంద శాతం సీట్లు భర్తీ కావ డంపట్ల ఆనందం వ్యక్తం చేశారు. తమ క ళాశాలలో సీట్లు వచ్చిన ప్రతి విద్యార్థి ఈనె ల 22 తేదీలోపు రిపోర్టు చేయాలని.. మరి న్ని వివరాలకు 9603999591, 7386324079 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ భూమికి ఎసరు

● అక్రమంగా వెలసిన గుడిసెలు ● రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో ఘర్షణకు దారితీసిన వైనం



అక్రమంగా వేసిన గుడిసెలను తొలగిస్తున్న అధికారులు



గుడిసెలు తొలగించే సమయంలో ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు

బద్వేలు, జూలై 17: బద్వేలులో భూ వివాదాలకు అడ్డుకట్ట పడడం లేదు. కబ్జారాయుళ్లు ఒకవైపు పేదల పేరుతో మరోవైపు ప్రభుత్వ స్థ లాలకు ఎసరు పెడుతూనే ఉన్నారు. రెవెన్యూ అధికారులు కబ్జాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారా... చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నా రా.. కారణం ఏదైతేనేం ఆక్రమణదారులకు అడ్డూ అదుపులేకుండా పో తోంది. తాజాగా బద్వేలు పట్టణం సమీపంలోని గోపవరం మండలం లో వెలసిన గుడిసెల వివాదం ఘర్షణకు దారితీసింది. గుడిసెలను స్థానికులు, రెవెన్యూ అధికారులు, పోలీసులు తొలగించడంతో వివా దం మొదలైంది. దీంతో స్థానికులు మరియు స్థానికేతరుల మధ్య ఘ ర్షణ నెలకొంది. ఇక్కడి పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జో క్యం చేసుకోవాల్సి వచ్చింది.


10 రోజులుగా వెలసిన గుడిసెలు

గోపవరం మండలం 1623, 1624 సర్వే నెంబర్లలో గ్రేటర్ రాయలసీ మ ఫోరం ఆధ్వర్యంలో 10 రోజుల క్రితం గుడిసెలు వేశారు. రెవెన్యూ కార్యాలయం సమీపంలోనే అక్రమంగా గుడిసెలు వేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. బుధవారం స్థానికులు మా స్థలంలో గు డిసెలు ఎలా వేస్తారని, గుడిసెలు వేసిన వారితో ఘర్షణపడ్డారు. మా టమాటా పెరిగి కొట్టుకునే వరకు దారితీసింది. ఈ ఘర్షణలో కొంత మందికి గాయాలయ్యాయి. గుడిసెలు వేసిన వారిలో ఓ సామాజిక వర్గానికి చెందిన వారు ఉండడంతో స్థానిక జనసేన నాయకులు అక్క డికి వెళ్లారు. సామాజిక వర్గం పేరుతో కొందరు మాట్లాడడంతో మ రింత ముదిరి ఘర్షణ వాతావరణం నెలకొంది. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా బద్వేలు ప్రాంతంలో ఘర్షణలు చోటు చేసుకుం టున్నాయన్న ఆరోపణలు సర్వత్రా వినవస్తున్నాయి. లంచాలు తీసుకు ని ఎవరికంటే వారికి పట్టాలు మంజూరు చేయడం ఇష్టానుసారంగా ఆన్‌లైన్ ఎక్కించడంతోనే ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు పేర్కొం టున్నారు. మరి ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి బద్వేలు లో ఆక్రమణలకు అడ్డు వేయకపోతే ముందుకూడా ఇలాంటి గొడవ లు తప్పవని చెప్పవచ్చు.

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

గుడిసెలు తొలగించే సందర్భంగా మాపై దాడిచేసి గాయపరిచిన వా రిపై తక్షణమే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాల ని గుడిసెలు వేసిన బాధితులు బద్వేలు రూరల్ పోలీసుస్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. ఘర్షణపడిన ఇరువర్గాల వారిని పోలీసులు అ దుపులోకి తీసుకున్నారు.

ప్రభుత్వ భూముల్లో గుడిసెలు దగ్ధం



గోపవరం, జూలై 17: గోపవరం మండలం మడకలవారిపల్లె గ్రామ పొలం సర్వేనెంబర్ 1622, 1623 సర్వేనెంబర్‌లో ప్రభుత్వం భూమిలో రైతు సంఘం నాయకుల ఆధ్వర్యంలో పేదలు గుడిసెలు వేశారు. మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు గుడిసెలకు నిప్పంటించారు. ఇది తెలుసుకున్న రైతు సంఘాల నాయకులు శ్రీనివాసపురం గ్రామ స్తులు దాడి చేశారని చర్చించుకుంటుండగా... అది తెలిసిన గ్రామ స్తులు వారితో వాగ్వాదానికి దిగారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ జరగగా ఒకరిపై ఒకరు రాళ్ళతో దాడి చేసుకున్నారు. మా గ్రామస్తుల స్థలాల్లో మీరు గుడిసెలు ఎలా వేస్తారని ఘర్షణ జరిగింది. ఇది తెలుసుకున్న పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాల వారిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కి తరలించారు.

ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

రాజంపేట, జూలై 17: అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక గ్రామంలో చెన్నకేశవస్వామి, సిద్ధేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలు బుధవారం ధ్వజారోహణంతో ప్రారంభించారు. సిద్ధేశ్వర ఆలయంలో తెల్లవారుజామున కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితులు అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం చేపట్టిన చెన్నకేశవ ఆలయంలో కూడా ఆలయ అర్చకులు, వేదపండితులు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి ఆలయ సూపరింటెండెంట్ వై.హనుమంతయ్య, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ, గ్రామ సర్పంచ్ గౌరీశంకర్, గ్రామ పెద్దలు అదృష్టదీపుడు, రమణయ్య, న్యాయవాది సురేష్‌రాజు, మనోజ్, పవన్‌కుమార్, కృష్ణ, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

త్రేతేశ్వరస్వామి ఆలయం అభివృద్ధి చేస్తాం

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు



జగన్‌మోహన్‌రాజును సన్మానిస్తున్న ఆలయ అర్చకులు, గ్రామస్తులు

రాజంపేట టౌన్, జూలై 17: శైవక్షేత్రాల్లో హత్యరాల కామాక్షి త్రేతేశ్వర స్వామి ఆలయం ఒకటని టీడీపీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా స్వామివారిని ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు పూల నరసింహులు, సుబ్రమణ్యంనాయుడు, ఆలయ అర్చకులు పద్మనాభస్వామి, పండితులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఏకాదశి సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. కాగా స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు కావాల్సిన వసతులపై జగన్‌మోహన్‌రాజు దృష్టికి తీసుకురాగా ఆలయ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పూల బాలాజీ, టీఎన్ఎస్ఎఫ్ నేత శివ పాల్గొన్నారు.

బాలుర బీసీ గురుకుల పాఠశాలను నిర్మించండి : టీఎన్ఎస్ఎఫ్



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న వేణుగోపాల్

నందలూరు, జూలై 17: మండలంలో బీసీ బాలుర గురుకుల పాఠశాలను నిర్మించాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేపూరి వేణుగోపాల్.. బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితను కోరారు. బుధవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గంలో అధిక సంఖ్యలో బీసీ విద్యార్థులున్నారని, వారికి అనుగుణంగా మండలంలో బీసీ గురుకుల పాఠశాలను నిర్మించాలని కోరానన్నారు. నందలూరులో అన్ని వసతులు ప్రభుత్వ స్థలం, మంచి వాతావరణం, స్వచ్ఛమైన నీరు అన్నింటికి అనువుగా ఉంటుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు.

ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు ముమ్మర చర్యలు



ఎన్టీఆర్ విగ్రహం వద్ద సర్పంచ్, నాయకులు

సంబేపల్లె, జూలై 17: టీడీపీ వ్యవస్థాపకుడు, స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు స్థానిక సర్పంచ్ నాగేశ్వర్‌నాయుడు ముమ్మర ఏర్పాట్లను చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం రాజమండ్రి నుంచి 9 అడుగుల ఎన్టీఆర్ విగ్రహాన్ని మండల కేంద్రానికి తరలించారు. నియోజకవర్గంలోనే ఇక్కడ అతిపెద్ద విగ్రహం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. త్వరలో విగ్రహ ఏర్పాటు మహోత్సవ కార్యక్రమం రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మట్లి వేణు, కడియాల నాగేశ్వర్‌నాయుడు, పలువురు టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కులమతాలకతీతం మొహర్రం వేడుకలు









గాలివీడులోని బోరెడ్డిగారిపల్లెలో పీర్లకు బాషికం కట్టే కార్యక్రమంలో లక్ష్మిప్రసాద్‌రెడ్డి, లక్కిరెడ్డిపల్లెలో జల్దీకి వెళుతున్న కొండయ్య పీరు, రైల్వేకోడూరు, రాజంపేటలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

● ఘనంగా పీర్ల ఊరేగింపు

● పలుచోట్ల భక్తులకు అన్నదానం

రాజంపేటటౌన్, జూలై 17: రాజంపేట పట్టణ, మండల పరిధిలో మొహర్రం ఉత్సవాలను గ్రామస్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఉత్సాహంగా నిర్వహించారు. బుధవారం పట్టణంలోని నాగులమాను వీధి సమీపంలో ఏర్పాటు చేసిన పీర్ల కొట్టంలో పండుగ సందర్భంగా పీర్లను హిందూ ముస్లిం తారతమ్యం లేకుండా పూలతో అలంకరించారు. అనంతరం పట్టణంలోని పలు వీధుల్లో వాటిని ఊరేగించారు.

గాలివీడు: హిందూ, ముస్లింలు మొహరం పండుగను సమైక్యంగా జరుపుకుంటారని మండిపల్లి లక్ష్మిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం బోరెడ్డిగారిపల్లెలో మాజీ సర్పంచ్ మహమ్మద్‌రఫీ, అలిమాభాను కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పీర్లకు గొడుగులు, పూల బాషికాలు సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పార్థసారధిరెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జగన్నాధరెడ్డి, యువగళం సభ్యులు సాయిప్రసాద్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, ప్రభాకర్‌రెడ్డి, రామాంజుల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: కులమతాలకు అతీతంగా నిర్వహించే పండుగ పీర్లపండుగను బుధవారం మండలంలోని సిద్దకవాండ్లపల్లె, పందిళ్లపల్లె, రెడ్డివారిపల్లె, కస్తూరి రాజుగారిపల్లె, కుర్నూతల గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. నాలుగు రోజుల నుంచి భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. సిద్దకవాండ్లపల్లెలో కొండయ్య స్వామి వారసులు డాక్టర్ భరత్‌కుమార్, విజయ భాస్కర్, దేవదాసు దంపతులు పాల్గొని కొండయ్య పీరుకు బాష్యం సమర్పించి పీరును ఊరేగింపు చేశారు. అనంతరం నిమజ్జనానికి వెళ్లాయి. కార్యక్రమంలో బాషా, బొమ్మనసాబ్, సిద్దక వెంకటరామిరెడ్డి, రజాక్, ఖాదర్‌బాషా, అమర్నాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రామాపురం: మొహరం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో బండపల్లి, రాచపల్లి, హసనాపురం, దూదేకులపల్లి, కుమ్మపల్లి గ్రామాల్లో మొహరం పండుగను బుధవారం ఆయా గ్రామాల ప్రజలు హిందూ, ముస్లిం సోదరులు కలిసి ఘనంగా నిర్వహించారు. పీర్ల చావిడిల్లో పీర్లను ఏర్పాటు చేసి 9 రోజుల నుంచి భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షతో పూజలు నిర్వహించారు.

రైల్వేకోడూరు: మండలంలోని శెట్టిగుంట, తురకపల్లె, రెడ్డివారిపల్లె తదితర గ్రామాల్లో మొహర్రం (పీర్ల పండుగ)ను బుధవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే పీర్లను పుర వీధుల్లో ఊరేగించారు. రాత్రి అగ్నిప్రవేశం చేశారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

వీరబల్లి: ఈడిగపల్లె, వీరబల్లి గ్రామాల్లో జరిగిన మొహర్రం వేడుకలకు ఆయా గ్రామాల టీడీపీ కార్యకర్తలు, గ్రామస్తుల ఆహ్వానం మేరకు బుధవారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు హాజరై ఈడిగపల్లి, వీరబల్లిల్లో ఉన్న పీర్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఈడిగపల్లెలోని టీడీపీ బీసీ నాయకుడు జయమేజయుడు ఇచ్చిన విందుకు హాజరయ్యారు. ఈయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి సురేంద్ర, టీడీపీ నాయకులు రెడ్డెప్పరెడ్డి, కల్లుగీత రాష్ట్ర మాజీ డైరెక్టర్ కొమర వెంకటనరసయ్య, రాంమోహన్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులురెడ్డి, వెంటరామరాజు, నాగరాజనాయుడు, రాజారాజు, వీరామృతనాయుడు, సిద్దిరాజు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

చిట్వేలి: చిట్వేలిలో బుధవారం వేకువజామున భక్తులు అగ్నిగుండం తొక్కి మొక్కులు తీర్చుకున్నారు. మండల పరిధిలోని నేతివారిపల్లె, నగిరిపాడు, కస్తూరివారిపల్లెల్లో మొహరం వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ముస్లిం మత పెద్దలు భక్తులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

పెనగలూరు: మండలంలోని కొత్తపల్లె, ఓబిలి, నల్లపురెడ్డిపల్లె గ్రామాల్లో మొహర్రం ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రంతో పీర్ల పండుగ ముగిసింది. మూడు గ్రామాల్లో పీర్లను స్థానిక నీటి వనరుల వద్ద నిమజ్జనం చేశారు. కొత్తపల్లె పీర్లు పెనగలూరు చెరువు వద్ద నిమజ్జనం చేశారు. అలాగే ఓబిలి పీర్లు చెయ్యేటిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.

పుల్లంపేట: మండల పరిధిలోని కోనయ్యగారిపల్లె, దళవాయిపల్లె, టి.బలిజపల్లె, కృష్ణంపల్లె, రామాపురం గ్రామాల్లో బుధవారం హిందూ, ముస్లింలు మొహర్రం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా టి.బలిజపల్లె, కృష్ణంపల్లె, దళవాయిపల్లె గ్రామాల్లో ఎమ్మెల్యే శ్రీధర్ పీర్లకు పూజలు చేసి వేడుకల్లో పాల్గొన్నారు. కోనయ్యగారిపల్లెలో అగ్నిగుండం ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో గుండం తొక్కారు. ఈ కార్యక్రమంలో బలిజసేన అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌నాయుడు, రాజారెడ్డి, లాయర్ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నమండెం: గంధపు పీరును షైనార్టీ మత గురువులు, వివిధ రకాల అధికారులు కడప దర్గా గురువు మహమ్మద్ ఆరిఫుల్లా హుస్సేనీఖాన్ సందర్శించారు. అలాగే రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు పూలచాదర్, గంధపు పీరుకు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు అనంతరం మొక్కు చెల్లించుకున్నారు. అలాగే రాష్ట్ర మంత్రి వర్యులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, రాహుల్‌రెడ్డిలు గంధపు పీరును సందర్శించి ప్రార్థనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వీరి వెంట పెద్దఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు సైతం మొక్కులు చెల్లించుకున్నారు.







పెనగలూరు: పి.కొత్తపల్లె పీర్లు ఏటికిపోతున్న దృశ్యం, పుల్లంపేట: పీర్ల చావిడి వద్ద ఎమ్మెల్యే శ్రీధర్, తదితరులు, చిన్నమండెం: పూలచాదర్ తీసుకొస్తున్న ప్రసాద్‌బాబు

సాగునీటి పనులు త్వరగా పూర్తి చేయాలి

● రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి బాలసుబ్రమణ్యం



ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న బాలసుబ్రమణ్యం

సుండుపల్లె, జూలై 17: పించా ప్రాజెక్టు దిగువ భాగంలో ఉన్న రైతులకు ఉపయోగకరంగా సాగునీటి పనులను త్వరగా పూర్తి చేయాలని రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. బుధవారం మండలంలోని పించా ప్రాజెక్టును ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. వైసీపీ ప్రభుత్వంలో పాలకుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారిందని, ప్రాజెక్టు మట్టి కట్ట కొట్టుకుపోయిన వెంటనే పాలకులు, ప్రభుత్వం సకాలంలో స్పందించి ఉంటే ఇప్పటికీ రైతులకు సాగునీటి సమస్య ఉండేది కాదన్నారు. దిగువ భాగంలో ఎక్కువ శాతం రైతులు గిరిజనులు, ఎస్సీలు, నిరుపేదలు ఉన్నారని, త్వరగా పనులు పూర్తి చేసి సాగునీటిని అందించాలని అధికారులను కోరారు. రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రాజెక్టు కుడికాలువ సమీపంలో నుంచి దిగువ భాగంలోని పల్లెలకు వెళ్లేందుకు రహదారి ఏర్పాటు చేయాలని పెద్ద సంఖ్యలో ప్రజలు కోరడంతో అధికారులకు సమస్యను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకట్రామయ్య, డీఈ వెంకటేశ్వరరావు, జేఈ మధుసూదన్‌రావు, ఎంపీపీ రాజమ్మ, రాష్ట్ర టీడీపీ లీగల్ సెల్ సెక్రటరీ ఈశ్వరయ్య, మండల అధ్యక్షుడు రెడ్డెప్ప, క్లస్టర్ ఇన్‌చార్జి శివకుమార్‌నాయుడు, వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి దామోదర్‌నాయుడు, చప్పిడి రమేశ్‌నాయుడు, జనసేన మహిళా నాయకురాలు రెడ్డిరాణి తదితరులు పాల్గొన్నారు.

రూ.4 లక్షలతో తాగునీరు అందజేత

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. బుధవారం మండలంలోని మడితాడు గ్రామ పంచాయతీ వానచపల్లి, దిగువ బిడికీలో రూ.4 లక్షలు ప్రభుత్వ నిధులు వెచ్చించి తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అక్కడికి వెళ్లిన బాలసుబ్రమణ్యంకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం గ్రామదేవత ఆలయంలో టెంకాయలు కొట్టి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజమ్మ, ఈవోపీఆర్‌డీ సురేశ్‌బాబు, పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్‌రెడ్డి, టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లునాయుడు, సురేశ్‌నాయుడు, రామచంద్ర, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారాలను అరికట్టాలి : సీపీఎం



మహిళలకు రక్షణ కల్పించాలని నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు

రాజంపేట, జూలై 17: రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులు అరికట్టే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం పట్టణంలోని పోస్టాఫీసు ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలపై పెద్దఎత్తున దాడులు జరుగుతున్నప్పటికీ అత్యాచారాలు అరికట్టడంలో పూర్తిగా విఫలమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల హక్కులను, మహిళలకు కావాల్సిన చట్టాలు అమలు కావాలంటే పోరాటాలు తప్పవని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రవికుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, నారాయణ, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతి

సిద్దవటం, జూలై 17: మండలంలోని భాకరాపేట ఆర్‌సీఎం పాఠశాలలో పదో తరగతి చదివి అధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతి అందించారు. వి.రాజా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ నిర్మల ప్రభావతి పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ.5 వేలు, రెండో బహుమతిగా రూ.3 వేలు, మూడో బహుమతిగా రూ.2 వేల ప్రోత్సాహక బహుమతులను విద్యార్థిని, విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో చర్చి ఫాదర్ లారెన్స్, విచారణ సిస్టర్లు రాజగోపాలమ్మ, విన్సెంట్ తదితరులు పాల్గొన్నారు.

మాండవ్య నదిని శుభ్రం చేయండి

● ప్రజాసంఘాలు, భారత న్యాయవాదుల సంఘం డిమాండ్



మాండవ్యనదిని పరిశీలిస్తున్న ప్రజాసంఘాల నాయకులు, న్యాయవాదులు

రాయచోటిటౌన్, జూలై 17: మురికినీటి గుంటగా మారిన మాండవ్యనదిని శుభ్రం చేసి డెంగ్యూ, మలేరియా వ్యాధుల నుంచి రాయచోటి ప్రజలను కాపాడాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక, భారత న్యాయవాదుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మాండవ్యనదిని ప్రజాసంఘాల నాయకులు, న్యాయవాదులు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.ఈశ్వర్ మాట్లాడుతూ మాండవ్యనది పరిశుభ్రతపైన, మురికినీటి కాలువలపైన గత ప్రభుత్వం దృష్టి పెట్టకుండా నిర్లక్ష్యం చేయడంతో పట్టణంలోని మురికినీరంతా మాండవ్యనదిలోకి వదిలేయడం వలన మురికినీటిగుంటగా మారిపోయి దోమల ఉత్పత్తి కేంద్రంగా తయారైందన్నారు. ఫలితంగా పట్టణమంతా దోమలు వ్యాపించి డెంగ్యూ, మలేరియాతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ లక్షలాది రూపాయలు ప్రైవేటు ఆసుపత్రుల్లో ఖర్చు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా వచ్చిన టీడీపీ ప్రభుత్వం శ్రద్ధ పెట్టి పట్టణ పరిధిలోని ఎగువ అబ్బవరం నుంచి దిగువ అబ్బవరం వరకు సుమారు ఐదు కి.మీ. పొడవున మురికినీటి గుంటలను, కంపచెట్లను తొలగించి నదికి ఇరువైపులా ఉన్న కాలువలకు మరమ్మతులు చేపట్టి మురికినీటిని రాయచోటికి దూరంగా వదిలేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం పౌరహక్కుల సంఘం న్యాయవాది పి.రెడ్డయ్య, ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకులు రామాంజనేయులు మాట్లాడారు. కార్యక్రమంలో భారతీయ అంబేడ్కర్ సేన రాష్ట్ర కార్యదర్శి పల్లం తాతయ్య, న్యాయవాదులు ధనుంజయ్‌కుమార్, ఆనంద్‌కుమార్, చిన్నయ్య, రవిశంకర్, వడ్డెర విద్యావంతుల వేదిక రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి మారుతీశంకర్, రజక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్‌బాబు, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, వడ్డెర విద్యావంతుల వేదిక ఉపాధ్యక్షుడు చల్లా రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన శ్రీనివాసకుమార్‌రాజు



కేంద్ర మంత్రికి వినతి ఇస్తున్న శ్రీనివాసకుమార్‌రాజు

రాయచోటిటౌన్, జూలై 17: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ బుధవారం మదనపల్లె పర్యటనకు వచ్చిన సందర్భంగా మదనపల్లె పట్టణంలోని చిప్పిలి గ్రౌండ్‌లో హెలిప్యాడ్ వద్ద బీజేపీ రాష్ట్ర కార్యవర్గ మాజీ సభ్యుడు, జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ పాలగిరి శ్రీనివాసకుమార్‌రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ తదితరులు కేంద్ర మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనస్వాగతం పలికారు. అనంతరం డాక్టర్ శ్రీనివాసకుమార్‌రాజు రోడ్ల నిర్మాణంపై కేంద్ర మంత్రికి వినతిపత్రం సమర్పించారు. రాయచోటి, వేంపల్లె, చాగలమర్రి మధ్య అసంపూర్తిగా ఉన్న రోడ్లకు టెండర్ల ప్రక్రియ ప్రారంభించి వెంటనే పూర్తి చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. అలాగే ఉమ్మడి కడప జిల్లాలో గువ్వలచెరువు ఘాట్‌రోడ్డులో టన్నెల్ ఏర్పాటుకు కేంద్రం నుంచి రూ.వెయ్యి కోట్లు కేటాయించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం కేంద్ర మంత్రిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు చమర్తి మహేశ్వర్‌రాజు, లోకేశ్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రుడి సన్నిధిలో ఎస్పీ దంపతులు



ఎస్పీ దంపతులను సత్కరించి తీర్థప్రసాదాలు అందజేస్తున్న ఆలయ అర్చకులు

రాయచోటిటౌన్, జూలై 17: పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామిని బుధవారం ఎస్పీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన విద్యాసాగర్‌నాయుడు కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. వీరికి జిల్లా దేవదాయశాఖ అధికారి విశ్వనాధ్, ఆలయ కార్యనిర్వాహణాధికారి డీవీ రమణారెడ్డిల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవార్ల విశిష్టత వివరించి, పట్టువస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు



ప్రత్యేక అలంకరణలో రాయచోటి లక్ష్మినరసింహ స్వామి ఆలయం

రాయచోటిటౌన్, జూలై 17: పట్టణంలోని లక్ష్మిపురంలో మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు ఆధ్వర్యంలో బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మిపురం భక్తులతో పాటు పట్టణంలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు, పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి ఆలయ పూజారి సాయిక ల్యాణ్‌శర్మ ఆధ్వర్యంలో భక్తాదులు విరివిగా పాల్గొని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ పూజారి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రామాపురం: మండలంలో బుధవారం తొలి ఏకాదశి వేడుకలను ప్రజలు, భక్తులు అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ప్రధానంగా బండపల్లి సమీపంలో ఉన్న కంభారాయుని కొండపై వెలసిన మహావిష్ణు దేవాలయంలో తొలి ఏకాదశి వేడుకలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ముక్కోటి బసిరెడ్డి, ఆయన సతీమణి సర్పంచ్ ఆధ్వర్యంలో మహావిష్ణు దేవాలయంలో పూజలను నిర్వహించారు. అలాగే గువ్వలచెరువు ఘాట్ రోడ్డు, నల్లగుట్టపల్లె, హసనాపురం తదితర ప్రాంతాల్లో ఉన్న శివాలయం, మహావిష్ణు ఆలయాల్లో పూజలను నిర్వహించారు. బుధవారం దక్షియానం ప్రారంభమవుతున్న దృష్ట్యా తొలి ఏకాదశి వేడుకలను భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు.

చిట్వేలి: తొలి వైకుంఠ ఏకాదశి సందర్భంగా మండల వ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు బుధవారం కేఎస్ అగ్రహారంలోని బూనీల సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అలాగే పాత చిట్వేలి భద్రకాళి సమేత వీరభద్ర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

ముగ్గురు ఆర్డీవోల చుట్టూ

ఓటరు జాబితా వివాదం

- తహసీల్దార్లు, బీఎల్వోల లాగిన్ ఐడీలన్నీ వైసీపీ నేతలకు అప్పగింత
- ప్రైవేటు కార్యాలయాల నుంచీ చంద్రగిరి ఓటర్ల చేర్పులు, తొలగింపులు
- ఓ ప్రైవేటు విద్యా సంస్థ విద్యార్థుల ప్రమేయం
- విచారణకు ప్రత్యేకాధికారిని నియమించే అవకాశం



తిరుపతి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి నియోజకవర్గ ఓటరు జాబితాలో అక్రమాలు జరిగాయని ఎన్నికలకు ముందు నుంచీ టీడీపీ వర్గీయులు గగ్గోలు పెడుతున్న వ్యవహారంలో ముగ్గురు డిప్యూటీ కలెక్టర్ల పేరు తెరమీదకు వస్తున్నాయి.గత ఐదేళ్లలో ఎక్కువ కాలం పాటు తిరుపతి ఆర్డీవోగా కనక నరసారెడ్డి పనిచేశారు. ఆయన గతేడాది సెప్టెంబరులో బదిలీ కావడంతో తర్వాత ప్రస్తుత ఆర్డీవో నిశాంత్ రెడ్డి ఆ స్థానంలో నియమితులయ్యారు. 2017-18 మధ్య తిరుపతి రూరల్ తహసీల్దారుగా పనిచేసిన మీసాల కిరణ్‌కుమార్ ఆ సమయంలో అప్పటి చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డికి సన్నిహితంగా వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. అప్పటి నుంచే 2024 ఎన్నికల్లో వైసీపీ గెలుపుకోసం అనుకూలంగా ఓటర్ల జాబితాను రూపొందించేందుకు ప్రణాళిక వేసినట్టు టీడీపీ వర్గీయులు ఆరోపిస్తున్నారు. తర్వాత డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి రాగా చెవిరెడ్డికి ఓఎస్డీగా నియమితులయ్యారు. తర్వాత గూడూరు ఆర్డీవోగా బదిలీ అయ్యారు. గూడూరు ఆర్డీవోగా పనిచేస్తూ కూడా తరచూ చంద్రగిరి నియోజకవర్గ ఓటరు జాబితా తయారీలో జోక్యం చేసుకున్నారని, దాదాపు ఆయనే పర్యవేక్షించేవారని చంద్రగిరి టీడీపీ ఇంచార్జి పులివర్తి నానీ ఎన్నికల ముందు ఈసీకి, ప్రభుత్వానికి అసంఖ్యాక ఫిర్యాదులు చేశారు. తిరుపతి ఆర్డీవోగా కనకనరసారెడ్డి కూడా చెవిరెడ్డికి అనుకూలంగా వ్యవహరించారని, ఆయన తర్వాత వచ్చిన ప్రస్తుత ఆర్డీవో నిశాంత్‌రెడ్డి కూడా అదే పంథా అవలంబించారని ఫిర్యాదులు వెళ్ళాయి. దీంతో చంద్రగిరి ఓటరు జాబితాలో బోగస్ ఓటర్ల చేర్పులు, టీడీపీ అనుకూల ఓటర్ల తొలగింపులకు వీరిదే ప్రధాన బాధ్యత అని ఫిర్యాదుల్లో పేర్కొన్నారు.

తిరుపతి, బెంగళూరు నుంచీ మార్పుచేర్పులు

తిరుపతిలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి ప్రైవేటు కార్యాలయం నుంచీ ప్రధానంగా ఓటర్ల జాబితా మార్పుచేర్పులు జరిగాయని టీడీపీ నేతలు ఫిర్యాదుల్లో ఆరోపించిన విషయం తెలిసిందే. అక్కడ చెవిరెడ్డి వద్ద పీఆర్వోగా పనిచేసిన ఓ రిటైర్డు డిప్యూటీ కలెక్టర్ పాత్ర కూడా కీలకమని ఫిర్యాదుల్లో ఆరోపించారు. అలాగే బెంగళూరులో ఆయన రియల్ ఎస్టేట్ వ్యాపార భాగస్వాముల కార్యాలయాల నుంచీ ఈ పనులు జరిగాయని తాజా ఫిర్యాదుల్లో ఆరోపించారు. చంద్రగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల తహసీల్దార్లు, బీఎల్వోలు, ఆర్డీవో కార్యాలయంలో చంద్రగిరి నియోజకవర్గ ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు లాగిన్ ఐడీలు, పాస్ వర్డులను ఈ రెండు ప్రైవేటు కార్యాలయాల సిబ్బందికి అందజేశారని, వాటి ఆధారంగా బోగస్ ఓటర్లను భారీ ఎత్తున చేర్పించడం, టీడీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగించడం జరిగిందని ఆ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. జాబితాలో చేర్పులు, తొలగింపుల వ్యవహారం చేపట్టడానికి తిరుపతిలోని ఓ ప్రైవేటు విద్యా సంస్థ విద్యార్థులను వినియోగించారని, ఆ సంస్థ యజమాని అన్నమయ్య జిల్లా కలికిరి మండలానికి చెందిన వారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అందరినీ విచారించనున్న సీఐడీ అధికారులు

గత ఐదేళ్లలో తిరుపతి ఆర్డీవోలుగా పనిచేసిన కనకనరసారెడ్డి, నిశాంత్‌రెడ్డిలతో పాటు గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్‌ను సీఐడీ అధికారులు విచారించనున్నారు. అలాగే ఆరు మండలాల తహసీల్దార్లు, బీఎల్వోలు, కంప్యూటర్ ఆపరేటర్లు, రిటైర్డు డిప్యూటీ కలెక్టర్, ప్రైవేటు విద్యా సంస్థకు చెందిన విద్యార్థులను కూడా ప్రశ్నించనున్నట్టు సమాచారం. ముఖ్యంగా గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ కాల్ డేటాను పరిశీలించాలని టీడీపీ నేతలు తమ ఫిర్యాదులో పేర్కొన్న నేపథ్యంలో దానిపైనా దృష్టి సారించే ఆస్కారం వుంది. తిరుపతిలోని చెవిరెడ్డి ప్రైవేటు కార్యాలయానికి ఆయన తరచూ రావడం, ఆరు మండలాల తహసీల్దార్లను అక్కడికి పిలిపించుకోవడం వంటి వాటికి సంబంధించి సీసీ కెమెరాల ఫుటేజీలు కూడా తమ వద్ద వున్నాయని టీడీపీ నేతలు చెబుతున్నారు. కాల్ డేటాను కూడా విశ్లేషించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అందువల్ల సీఐడీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది.

ప్రత్యేకాధికారి నియామకానికి సీఎం చొరవ

తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల సందర్భంగా తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో వెలుగు చూసిన ఓటరు కార్డుల అక్రమ డౌన్‌లోడింగ్, నకిలీ ఓటరు కార్డుల తయారీ వ్యవహారం దేశవ్యాప్తంగా కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న చంద్రబాబు గత ఎన్నికల్లో చంద్రగిరి నియోజకవర్గ ఓటరు జాబితా అక్రమాలు కూడా తెలియడంతో వీటిపై ప్రత్యేక దృష్టి సారించినట్టు సమాచారం. ఈ రెండు అంశాలను కేస్ స్టడీలుగా తీసుకుని భవిష్యత్తులో రాష్ట్రంలో ఎక్కడా పునరావృతం కాకుండా చూడాలని భావిస్తున్నట్టు తెలిసింది. అందులో భాగంగా తిరుపతి, చంద్రగిరి ఓటర్ల జాబితాల అక్రమాలపై లోతుగా విచారణ జరిపించేందుకు ప్రత్యేకాధికారిని నియమించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు టీడీపీ వర్గాల ద్వారా తెలిసింది.వైసీపీ నేతలు చాలా తేలిగ్గా తీసుకుని ఓటర్ల జాబితాలో ఇష్టానుసారం అక్రమంగా మార్పుచేర్పులు చేయించారని, అయితే తాజాగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో పరిణామాలు ఆషామాషీగా వుండవని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. ఓటర్ల జాబితా అక్రమాలకు బాధ్యులైన వారిపై తీవ్రస్థాయి చర్యలే వుంటాయని చెబుతున్నాయి. దీన్నిబట్టి రానున్న రోజుల్లో తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు సంభవించే అవకాశాలున్నాయని భావించాల్సి వస్తోంది.

బైక్ దొంగ అరెస్టు

12 ద్విచక్ర వాహనాల స్వాధీనం



నిందితుడిని చూపుతున్న సీఐ రవిశంక్‌రెడ్డి

ఐరాల(కాణిపాకం), జూలై 17: కాణిపాకం పోలీసులు బుధవారం బైక్ దొంగను అరెస్టు చేసి, అతని నుంచి 12 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కాణిపాకం పోలీస్‌స్టేషన్‌లో చిత్తూరు వెస్టు సీఐ రవిశంకర్‌రెడ్డి ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు. మద్దిపట్లపల్లె వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా బంగారుపాళ్యం మండలం బండ్లదొడ్డి గ్రామానికి చెందిన అంతర్రాష్ట్ర దొంగ కోటీశ్వర్(కోటి) పట్టుబడినట్లు తెలిపారు. అతను ఇప్పటివరకు చిత్తూరు, బంగారుపాళ్యం, తవణంపల్లె, ఐరాల, తిరుపతి, తిరుచానూరు, పెనుమూరు, యాదమరి, కాణిపాకం, రేణిగుంట ప్రాంతాలలో చోరీలు చేసినట్లు వివరించారు. అతన్ని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి, వాహనాలను స్వాధీన పరచుకున్నట్టు వెల్లడించారు. కేసు ఛేదించిన కాణిపాకం ఎస్ఐ రామ్మోహన్‌ను సీఐ అభినందించారు.

ఏనుగుల గుంపు స్వైరవిహారం



బూరగపల్లె సమీపంలో ఏనుగులు ధ్వంసం చేసిన టమోటా పంట

చౌడేపల్లి, జూలై 17: చౌడేపల్లి మండలంలోని పలు ప్రాంతాల్లో ఏనుగుల గుంపు స్వైరవిహారం చేసి పలు పంటలను ధ్వంసం చేశాయి. మంగళవారం రాత్రి పందిళ్లపల్లె, చుక్కావారిపల్లె సమీపంలోని బురగపల్లెకు చెందిన మునిరాజా, పార్వతమ్మల రెండు ఎకరాల టమోటా తోటలో తిరగాడి పంటను తొక్కివేశాయి. వెంకటరెడ్డికి చెందిన ఎకరా టమోటా, మొక్కజొన్న పంటలను ధ్వంసం చేశాయి. అంజిరెడ్డి, రామచంద్రారెడ్డికి చెందిన టమోటా తోటల్లో తిరగాడి పంటలను ధ్వంసం చేసినట్లు రైతులు తెలిపారు.

వరసిద్ధుడి సేవలో మంత్రి కొల్లు



ఐరాల(కాణిపాకం), జూలై 17: రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర బుధవారం కాణిపాక వరసిద్ధుడిని కటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అభిషేక సేవలో పాల్గొన్నారు. ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి వారికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, నాయకులు గిరిధర్‌బాబు, మధుసూదనరావు, లత, హేమాద్రినాయుడు, నరసింహలునాయుడు పాల్గొన్నారు.

నేటి నుంచి మండల కేంద్రాల్లో.. తక్కువ ధరకే నిత్యావసర సరుకులు



టెలీ కాన్ఫరెన్స్‌లో జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 17: ధరల నియంత్రణలో భాగంగా జిల్లావ్యాప్తంగా గురువారం నుంచి మండల కేంద్రాల్లో బియ్యం, కందిపప్పు, పామోలిన్ విక్రయించేలా చర్యలు చేపట్టాలని జేసీ శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం ఆయన టెలి కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీవోలు, తహసీల్దార్లు, సివిల్ సప్లయ్ డీటీలు, డీఎస్వో శంకరన్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం మోహన్ బాబుకు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే రైతు బజార్‌లో తక్కువ ధరకే బియ్యం (స్టీమ్ రకం రూ.49, పచ్చిబియ్యం రూ.48), కందిపప్పు కేజీ రూ.160, పామోలిన్ ఆయిల్ (ప్రియా బ్రాండ్) లీటరు రూ.90కు విక్రయిస్తున్నట్లు చెప్పారు. గురువారం నుంచి మండల కేంద్రాల్లో ప్రత్యేక కౌంటర్లు తెరచి విక్రయాలు ప్రారంభించాలని సూచించారు.

22 నుంచి పాఠశాలల్లో శిక్షా సప్తాహ్

చిత్తూరు (సెంట్రల్), జూలై 17: జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహించేలా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. జాతీయ విద్యావిధానం, సంస్కరణలు తెలియజేయడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. 22న బోధన, అభ్యసన సామగ్రిని టీచర్లు ప్రదర్శించాల్సి ఉంది. 27న అమ్మతో కలిసి విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటాలి. 28న విద్యార్థులతో కలసి టీచర్లు సహపంక్తి భోజనం చేయాలి. కార్యక్రమ నిర్వహణకు సంబంధించిన వివరాలను డీఈవో కార్యాలయానికి తెలియజేయాల్సి ఉంది.

వైసీపీ పాలనలో లాక్కున్న భూములను తిరిగి రైతులకే అప్పగిస్తాం: మంత్రి



కమ్మపల్లెలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

సోమల, జూలై 17: వైసీపీ పాలనలో లాక్కున్న భూములను తిరిగి ఆ రైతులకు అప్పగిస్తామని రాష్ట్ర మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమల మండలం కమ్మపల్లెలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోనే అత్యధికంగా పుంగనూరు నియోజకవర్గంలో భూ ఆక్రమణలు, రైతులపై దాడులు, టీడీపీ వారిపై అక్రమ కేసుల నమోదు రికార్డు స్థాయిలో జరిగాయన్నారు. దౌర్జన్యపూరితమైన పాలనకు భయపడి రైతులు గప్‌చుప్‌గా ఉండిపోయారన్నారు. గత ఐదేళ్లలో భూములను తక్కువ ధరకు కొనుగోలు చేసి ఆ తర్వాత రెండింతల ధరలకు ప్రభుత్వానికి విక్రయించారన్నారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పలువురు కార్యదర్శులు తమ పెండింగ్ సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో పుంగనూరు నియోజకవర్గం టీడీపీ, బీజేపీ ఇన్‌చార్జులు చల్లా రామచంద్రారెడ్డి, గన్నా మదన్‌మోహన్‌బాబు, మండల పార్టీ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు, నాగభూషణం రాయల్, శీలం రామూర్తి, మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతినాయుడు, రమేశ్ నాయుడు, బాల సుబ్రమణ్యం నాయుడు, రామనాధం నాయుడు, అష్రఫ్ అలీ పాల్గొన్నారు.

గవర్నర్ ఆదేశించినా..!

- చదువుల తల్లికి అందని ఎన్ఎస్‌పీ స్కాలర్‌షిప్
- ఉన్నత విద్యను ప్రోత్సహించని ఎస్వీయూ అధికారులు
- న్యాయం చేయాలంటూ రాష్ట్రపతికి పుంగనూరు విద్యార్థిని ఫిర్యాదు



ఉష

పుంగనూరు, జూలై 17: ఉన్నత విద్యకు ప్రోత్సాహకంగా ఎన్ఎస్‌పీ స్కాలర్‌షిప్ ఇవ్వాలని రాష్ట్ర గవర్నర్ ఆదేశించినా తిరుపతి ఎస్వీయూ అధికారులు పట్టించుకోలేదని పేద విద్యార్థిని ఉష పేర్కొన్నారు. దీనిపై బుధవారం ఆమె మాట్లాడారు. బాధితురాలు తెలిపిన ప్రకారం.. పుంగనూరు కోనేటిపాళ్యంకు చెందిన క్షురక వృత్తి చేసుకునే ఎం.ఉమాశంకర్ కష్టపడి కుమార్తె ఎం.ఉషను బీఎస్సీ, కుమారుడు జితేంద్రను బీటెక్ చదివించారు. ఉష డిగ్రీలో 90శాతం మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ ఇన్‌స్ట్రుమెంటేషన్ కోర్సులో 2021లో చేరారు. మొదటి సంవత్సరంలోనే ఎన్ఎస్‌పీ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసినా విద్యాదీవెన వస్తుండటం వల్ల ఇవ్వడం కుదరదని నిరాకరించారు. 2021 నవంబరు 5న అప్పటి గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌కు ఫిర్యాదు చేయగా ఆయన అదే ఏడాది డిసెంబరు 29వ తేది ఎస్వీయూ వీసీకి లేఖపంపుతూ పేదవిద్యార్థిని చదువుకు స్కాలర్‌షిప్ ఇప్పించాలని ఆదేశించారు. అయినా అధికారులు పట్టించుకోలేదు. ఈ సమస్యను అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ఆమె వాపోయారు. 80 శాతం మార్కులతో ఎమ్మెస్సీ ఉత్తీర్ణులైనా (యూజీసీ నిబంధన ప్రకారం 60 శాతం ఉన్నా) గోల్డ్‌మెడల్ ఇవ్వలేదన్నారు. పీహెచ్‌డీ చేయాలని ఏపీఆర్‌సెట్ రాసినా అర్హత సాధించలేదన్నారు. గత ప్రభుత్వంలో అనేక పర్యాయాలు ఉన్నత అధికారులకు ఫిర్యాదులు చేసినా తనకు న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. కొత్త ప్రభుత్వంలోనైనా న్యాయం జరుగుతుందనే ఆశతో గత నెల 26వ తేది రాష్ట్రపతి ద్రౌపతిముర్ము, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, హోంశాఖమంత్రి అమిత్‌షా, యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్, గవర్నర్ నజీర్‌అహ్మద్, సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, జిల్లా కలెక్టర్‌లకు లేఖలు పంపానని తెలిపారు. ఉన్నత చదువుపై ఆసక్తితో ఉన్న తనను ప్రభుత్వం ప్రోత్సహించేలా ఎన్ఎస్‌పీ స్కాలర్‌షిప్‌తో బాటు అర్హతను బట్టి ఎస్వీయూ గోల్డ్‌మెడల్, పీహెచ్‌డీకి అవకాశం ఇవ్వాలని ఉష కోరారు.

మద్యం మత్తులో దూడను చంపేశాడు

- నిందితుడిని పోలీసులకు అప్పగించిన స్థానికులు





చనిపోయిన దూడ - నిందితుడిని చెట్టుకు కట్టేసిన స్థానికులు

గుడుపల్లె, జూన్ 17: మద్యం మత్తులో ఓ వ్యక్తి లేగ దూడను గాయపరచి చంపిన ఘటన గుడుపల్లె మండలం చోటుచేసుకొంది. స్థానికుల కథనం మేరకు...అత్తినత్తం గ్రామానికి చెందిన వేణుగోపాల్‌కు బిసానత్తం సమీపంలో వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిని కర్ణాటక రాష్ట్రం టేకల్‌కు చెందిన మునిస్వామికి కౌలుకు ఇచ్చాడు. మునిస్వామి తన కుటుంబంతో ఈ భూమిలో వ్యవసాయం చేసుకొని పాడి ఆవులను పెంచుకొంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఒంటిపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యం(44) కాడేపల్లెకు చెందిన తన స్నేహితుడు వెంకటేశుతో కలిసి కర్ణాటక సరిహద్దు బిసానత్తం సమీపంలో ఉన్న మద్యం షాపు చేరుకొని మద్యం సేవించారు. కొంత సమయం తరువాత వెంకటేశు తన గ్రామానికి వెళ్లిపోయాడు. సుబ్రహ్మణ్యం అక్కడే ఉండి అతిగా మద్యం సేవించి కాలినడకన తన గ్రామానికి బయలుదేరాడు. అదే దారిలో రోడ్డు పక్కన మునిస్వామి తన పాడి ఆవులు, దూడను చెట్టు కింద కట్టేసి ఉంచాడు. లేగ దూడ అరవడం గమనించిన సుబ్రహ్మణ్యం మద్యం మత్తులో ఆ దూడపైకి దూకి గాయపరిచి చంపేశాడు. పాడి ఆవులు అరుపులు చేయడంతో గమనించిన వేణుగోపాల్ కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని పరిశీలించగా దూడ గాయాలతో చనిపోయి ఉండడం గమనించారు. అక్కడే ఉన్న సుబ్రహ్మణ్యంను వీరు ప్రశ్నించగా మద్యం మత్తులో ఇతడు వారిపై దాడి చేయసాగాడు. దీంతో వేణుగోపాల్ కుటుంబ సభ్యులు స్థానికుల సహాయంతో సుబ్రహ్మణ్యంను బంధించి చెట్టుకు కట్టేసి పోలీసులకు అప్పగించారు. పోలీసులు నిందితుడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

జీవాల చోరీ ముఠా అరెస్టు



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గంగవరం, జూలై17: జీవాలను అపహరించి.. వాటిని విక్రయించి సొమ్ము చేసుకొని జల్సాలకు పాల్పడే ముఠాను గంగవరం పోలీసులు పట్టుకున్నారు. బుధవారం పలమనేరు డీఎస్పీ విష్ణురఘువీర్ నిందితులను అరెస్ట్ చూపి వివరాలను వెల్లడించారు. అనంతపురం జిల్లాలో జీవాలు దొంగలించడమే పనిగా పెట్టుకున్న ముఠా.. తర్వాత పెద్దపంజాణి మండలానికి మార్చుకొని దొంగతనాలు ప్రారంభించింది. రెండునెలల కాలంలో పెద్దపంజాణి, గంగవరం మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో 112జీవాలు చోరీకి గురయ్యాయి. బాధితులు వరుసగా ఫిర్యాదులు చేయడంతో కేసు నమోదు చేసి గంగవరం అర్బన్ సీఐ చిన్నగోవిందు, ఐడీ పార్టీ ఏఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లె క్రాస్ వద్ద ఐదుగురు ఒక లగేజ్ వాహనంలో జీవాలను లోడ్ చేసుకుంటున్నారని సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి చేరుకుని అనంతపురం జిల్లా రాప్తాడు మండలానికి చెందిన ఎరికల చంద్రశేఖర్ (30), దేరంగుల విజయ్ (20), ఎరుకుల వాసు (25), బెస్త రాకేష్ (22), అనంతపురం టౌన్‌కు చెందిన శెట్టి సురేంద్ర(21)లను అదుపులోకి తీసుకొని విచారణ ప్రారంభించారు. చోరీ చేసిన జీవాలను మదనపల్లె శివారులో కట్ చేసి కిలోల లెక్కన విక్రయించి సొమ్ము చేసుకొనేవారిమని, జీవాలను దొంగలిస్తే పట్టించుకోరనే ధీమాతోనే దొంగతనాలకు పాల్పడ్డామని పోలీసుల ఎదుట అంగీకరించారు. పట్టుబడిన ఐదుగురిని అరెస్ట్ చేసి వారి వద్దనుంచి చోరీలకు గురైన 82 జీవాలు, 1.72 లక్షల నగదుతోపాటు రెండు వాహనాలతో కలసి మెత్తం 9.29 లక్షల సొమ్మును సీజ్ చేసి కోర్టుకు హాజరుపరచామన్నారు. ఈ ముఠాను పట్టుకోవడానికి కృషిచేసిన సీఐ చిన్నగోవిందు, ఏఎస్ఐ శ్రీనివాసులు, అశ్వర్థనారాయణ, అశోక్, అల్లాఉద్దీన్, నశిధర్, శేషాచలంలను డీఎస్పీ అభినందించి రివార్డులకు సిఫారసు చేస్తున్నట్లు ప్రకటించారు.

టీటీడీ అధికారుల అత్యుత్సాహం

- పొగాకు ఉత్పత్తులు సీజ్ చేయడంపై తిరుచానూరు వ్యాపారుల ఆగ్రహం



దుకాణాల్లో సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

తిరుచానూరు, జూలై 17: మాంసం, పొగాకు విక్రయాల నిషేధంపై ముందస్తుగా నోటీసులు కూడా ఇవ్వకుండా టీటీడీ అధికారులు సరుకు స్వాధీనం చేసుకోవడం తిరుచానూరులో విమర్శలకు దారితీసింది.వారం రోజుల క్రితం హిందూ సంఘాలు తిరుచానూరులో మాంసం , పొగాకు ఉత్పత్తులు అమ్మకుండా చర్యలు తీసుకోవాలని టీటీడీ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో మాంసం, పొగాకు ఉత్పత్తులు అమ్మకుండా మాడవీధుల్లో వ్యాపారులకు అవగాహన కల్పించాలని పంచాయతీ ఈవోకు టీటీడీ విజిలెన్స్ అధికారులు సూచించినట్లు సమాచారం.తరువాత పంచాయతీ సిబ్బంది మాడ వీధుల్లో ఉన్న షాపుల వద్దకు వెళ్లి సిగరెట్లు, బీడీలు విక్రయించరాదని చెప్పారు. పంచాయతీ నుంచి నోటీసులు ఇచ్చి, స్థానిక వ్యాపారులకు అవగాహన కల్పించాక పొగాకు ఉత్పత్తులపై నిషేధం అమల్లోకి తెచ్చివుంటే బాగుండేది.అలా కాకుండా టీటీడీ ఎస్టేట్ విభాగంలో తహసీల్దారు లలితాంజలి, ఏవీఎస్వో సతీష్‌కుమార్, పంచాయతీ అధికారులు బుధవారం ఉదయం ఆలయ మాడవీధుల్లోని దుకాణాల్లో తనిఖీలు చేశారు.దుకాణాల్లో వున్న సిగరెట్లు, బీడీలను వెలుపల వేసి మూటకట్టి శ్రీవారి సేవకుల ద్వారా విజిలెన్స్ కార్యాలయానికి తీసుకెళ్లారు.దీంతో దుకాణదారులంతా అక్కడికెళ్లి ముందస్తు సమాచారం లేకుండా అంగళ్లలో సరుకును ఎలా తీసుకెళ్తారంటూ గట్టిగా ప్రశ్నించారు. పొగాకు ఉత్పత్తులు విక్రయించవద్దని నోటీసులు ఎప్పుడైనా ఇచ్చారా.. లేదా సమావేశం పెట్టారా.. పోనీ నిషేధం ఏమైనా ఉందా...మీ దగ్గర ఏవైనా ఉత్తర్వులున్నాయా అని ప్రశ్నించడం మొదలెట్టారు.దీంతో వారికి సమాధానం చెప్పలేక తీసుకెళ్లిన పొగాకు ఉత్పత్తులను తిరిగి దుకాణదారులకు ఇచ్చేశారు.

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా పమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

మంత్రి మండిపల్లికి టీడీపీ నేతల ఘన స్వాగతం

మదనపల్లె, జూలై 17: రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లె రామ్‌ప్రసాద్‌రెడ్డికి మదనపల్లె టీడీపీ నేతలు ఘనస్వాగతం పలికారు. బెంగళూరు నుంచి మంత్రి హోదాలో మదనపల్లెకు మొదటిసారిగా విచ్చేస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి, పార్టీనేతలు, కార్యకర్తలు కర్ణాటక సరిహద్దులోని చీకలబైలు వద్దకు వెళ్లి ఘనస్వాగతం పలికారు. ఇందులో టీడీపీ తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీరామ్ చిన బాబు, టీడీపీ సీనియర్‌నేత కె.మల్లికార్జుననాయుడు, పార్లమెంటు ప్రధాన కార్యదర్శి వై.దొరస్వామినాయుడు, మైనార్టీనేతలు ఎస్.ఎ. మస్తాన్, పఠాన్ ఖాదర్‌ఖాన్, తదితరులు ఉన్నారు. పట్టణానికి చేరు కున్న మంత్రి..మొదట జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలకు విచ్చేయగా కరస్పాండెంట్ రాటకొండ గురుప్రసాద్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం ఇక్కడి నుంచి సైదాపేటలోని స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా..కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా అక్కడ ఎమ్మెల్యే..ఆధ్వర్యంలో మంత్రికి ఘనస్వాగతం లభించింది. అనంతరం ఎమ్మెల్యే, మంత్రి వివిధ అంశాలపై చర్చించారు. అక్కడ టౌన్‌బ్యాంకు మాజీచైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, రాటకొండ గుర్రప్పనాయుడు, సర్పంచి ప్రభాకర్, కౌన్సిలర్ పి.తులసీ, రామకృష్ణ, తదితరులు ఉన్నారు. అలాగే తిరిగి మంత్రి..రెడ్డీస్‌కాలనీలోని టీడీపీ సీనియర్ నేత కె.మల్లికార్జున నాయుడు నివాసానికి వెళ్లారు. అక్కడ తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీరామ్‌చినబాబు, పుంగనూరు ఇన్‌చార్జి చల్లా బాబురెడ్డి, తంబళ్లపల్లె ఇన్‌ఛార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డికి ఘనస్వాగతం లభించింది. ఈ సందర్భంగా పార్టీనాయకులు, కార్యకర్తలు, పార్టీశ్రేణులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌ఛార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డి,


తన నివాసానికి విచ్చేసిన మంత్రి మండిపల్లికి స్వాగతం పలుకుతున్న టీడీపీ నేత కె.మల్లికార్జుననాయుడు


మంత్రికి స్వాగతం పలుకుతున్న మండల టీడీపీ అధ్యక్షుడు పాలగిరి సిద్ధా

తంబళ్లపల్లె నియోజకవర్గ ప్రచార కార్యదర్శి కొపూరి మల్లికార్జున నాయుడు, అధికార ప్రతినిధి మొటుకుపల్లె శివ, తదితరులు కర్ణాటక రాష్ట్రం తాడిగల్లు క్రాస్‌కు వెళ్లి మంత్రికి ఘన స్వాగతం పలికారు.

ములకలచెరువు : బెంగళూరు విమానాశ్రయం నుంచి మదనపల్లెకు వస్తున్న మంత్రితోపాటు, తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరి పల్లి జయచంద్రారెడ్డికి రాష్ట్ర సరిహద్దు సమీపంలోని తాడిగోళ్ల క్రాస్ వద్ద టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా తదితరులు ఘనస్వాగతం పలికారు. నియోజకవర్గ ప్రచార సమన్వయ కర్త సీడు మల్లికార్జుననాయుడు,నేత మంత్రి గిరిధర్‌రెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు చెన్నకిష్టా, జిల్లా నాయీ బ్రాహ్మణ సెల్ అధ్యక్షుడు కేశవులు, మండల ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, శివన్న, రెడ్డెప్ప, గాండ్ల రెడ్డెప్ప, భాస్కర్‌నాయుడు, గొడ్డుమూరు రవి, నాగేంద్ర, ప్రతాప్‌నాయుడు, సోమశేఖర్, పీటీఎం, బి.కొత్తకోట మండల నాయకులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం: మండల టీడీపీ నాయకులు కట్టా సురేంద్ర నాయుడు, మదుమూరు యువనాయకుడు నవీన్ కుమార్ మదనపల్లెలో ఆయనకు పూల మాలలు, శాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం మండలంలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మండలంలోని పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించాలని, పీటీఎం నుంచి పలు మార్గాల్లో ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని ఆయనను కోరినట్లు తెలిపారు.

మదనపల్లె అర్బన్: మదనపల్లెకు విచ్చేసిన రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని చీకలబైలు వద్ద ఆర్టీసీ వన్ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి కలిసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దుశ్శాలువా కప్పి సన్మానించారు. ఆర్టీసీలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని మంత్రిని విన్నవించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు రేవతి, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఔటర్ రింగురోడ్డు మంజూరు చేయండి

- కేంద్రమంత్రికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా వినతి

మదనపల్లె, జూలై 17: మదనపల్లెకు ఔటర్‌రింగురోడ్డు మంజూరు చేయాలని స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్ బాషా, కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీని కోరారు. బుధ వారం మదనపల్లెకు విచ్చేసిన కేంద్రమంత్రికి చిప్పిలి సమీపంలోని మైదానంలో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా.. పద్మశ్రీ ఎస్. ముంతాజ్‌అలీ(శ్రీఎం)తో కలసి హెలిప్యాడ్ నుంచి నక్కల దిన్నెలోని సత్సంగ్ ఆశ్రమానికి చేరుకున్నారు. అక్కడ వి శ్రాంతి తీసుకుంటున్న కేంద్రమంత్రిని మరోసారి కలసిన షాజహాన్‌బాషా వివిధ అంశాలతో కూడిన విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. మదనపల్లెను నాలుగు వైపులా కలుపుతూ ఔటర్‌రింగు రోడ్డు మం జూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మదనపల్లె కేంద్రంగా 500 మంది లారీ యజమానులు ఉన్నారని, వారికి సరైన బాడుగలు దొరక్క ఇబ్బందులు పడుతున్నట్లు ఎమ్మెల్యే, కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అడపా దడపా దొరికే బాడుగలు కూడా మధ్యవర్తుల కారణంగా సక్రమంగా అందక ఎంతోమంది లారీ యజమానులు, డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకున్నట్లు వివరించారు. ఈ నేపథ్యంలో కార్లు, ఆటోలకు ఓలా తరహాతో దేశవ్యాప్తంగా ఈ విధానాన్ని అమలు చేయడంతో పాటు రవాణాశాఖ అధికారులతో మాట్లాడిన బాడుగ నిర్ణయించాలని కోరారు. రవాణా రంగంలో ఈవిధానం చాలా మంచిదని కొనియాడిన గడ్కరీ..ఢిల్లీకి రావాలని, అక్కడ సమావేశం నిర్వహించి చర్చిద్దామని ఎమ్మెల్యేకు సూచించారు. అలాగే బెంగళూరురోడ్డు ఎన్‌హెచ్ పనులు పూర్తయ్యాయని అని గడ్కరీ.. షాజహాన్ బాషాను అడిగి తెలుసుకున్నారు. లేదనే సమాధానం ఇవ్వడంతో వెంటనే పూర్తిచేసేలా అధికారులను ఆదేశి స్తానని హామీ ఇచ్చారు. అలాగే మదనపల్లె- రామసముద్రం రోడ్డును రోడ్డు, భవనాలశాఖ నుంచి అప్‌గ్రేడ్ చేస్తూ- జాతీయ రహదారిగా మారిస్తే.. సమీపంలోని బెంగళూరుకు వెళ్లడానికి అనుకూలంగా ఉంటుందని సూచించారు. ఎమ్మెల్యే సూచనల అమలుకు చర్యలు తీసుకుంటానని కేంద్రమంత్రి హామీ ఇచ్చారు.

వైసీపీ పాలనలో ఒరిగిందేమీ లేదు

మంత్రి నారా లోకేశ్‌తోనే బీటీ కళాశాల ఉద్యోగులకు న్యాయం ● ఎమ్మెల్యే షాజహాన్ బాషా

మదనపల్లె టౌన్, జూలై 17: బీటీ కళాశాలలో పనిచేస్తున్న 32 మంది ఉద్యోగులకు న్యాయం చేసింది రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా స్పష్టం చేశారు. బుధవారం స్థానిక బెంగళూరు బస్టాండు వద్ద టీడీపీ కార్యాలయంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పరమయ్యాక బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిబ్బందిని స్వాధీనం చేసుకోలేదన్నారు. దీనిపై ఇక్కడి అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది రెండేళ్లుగా వైసీపీ పాలకులను ప్రాధేయపడినా వారి నుంచి స్పందన లేదన్నారు. ఈ నెల 11న బాధితులు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి వారి సమస్య తీసుకెళ్లడంతో ఆయన తనకు ఫోన్ చేశారన్నారు. తాను వాస్తవ పరిస్థితులు వివరించడంతో 24 గంటల్లో 32 మందికి నియామకపత్రాలు, వేతన బకాయిలు చెల్లించేలా ఉత్తర్వులు జారీ చేశారన్నారు. అనీబీసెంట్ స్థాపించిన బీటీ కళాశాలలో లక్షలాది మంది డిగ్రీ, పీజీ చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదిగారన్నారు. బీటీ కళాశాల అభివృద్ధికి తాను ఎమ్మెల్యేగా ఉన్నపుడు రూ.6.5 కోట్ల నిధులు తీసుకొచ్చానన్నారు. ఇలాంటి బీటీ కళాశాల ఆస్తులు కాజేసేందుకు వైసీపీ ప్రభుత్వ పాలనలో కుటిలయత్నం చేశారని ఆరోపించారు. టౌన్‌బ్యాంకు మాజీ చైర్మన్ విద్యాసాగర్


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా


మాట్లాడుతూ మదనపల్లెలో ఓ టీడీపీ నాయకుడు ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేరు చెబుతూ కొన్ని చోట్ల అక్రమ వసూళ్లు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై విచారించి పోలీసు కేసు పెడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉద్యోగులు కరీం, చలపతి, నరసింహులు, అనూషా, కవిత, గౌసియా, కృష్ణవేణితో పాటు మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ రాట కొండ గుర్రప్పనాయుడు, టీడీపీ నాయకులు నాదెళ్ల శివన్న, బాబా ఫకృద్దీన్, నాగూర్‌వలి, నవీన్, ఇంతాయాజ్ తదితరులు పాల్గొన్నారు.

గొంతెండుతోంది.. ట్రాన్స్‌ఫార్మర్ ఎప్పుడిస్తారు?

● 2021లో దరఖాస్తు.. నేటికీ విద్యుత్ సౌకర్యం కల్పించనిఅధికారులు

పెద్దతిప్పసముద్రం జూలై 16 : తాగునీటి పథకానికి సంబంధించిన బోర్లకు విద్యుత్ సర్వీసు కోసం మూడేళ్ల క్రితం దరఖాస్తు చేసుకుంటే నేటి వరకు ట్రాన్స్‌పార్మర్లు మంజూరు చేయకుండా విద్యుత్ శాఖ అధికారులు వేధిస్తున్నారని పెద్దతిప్పసముద్రం మండలం పోతుపేట పంచాయతీ సర్పంచ్ కొండా కళావతమ్మ ఆవేదన వ్యక్తం చేశారు . బుధవారం ఆమె విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి చెందిన సర్పంచ్‌ననే విద్యుత్ సర్వీసు ఇవ్వకుండా తనను, గ్రామస్థులను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. తన తరువాత దరఖాస్తు చేసుకున్న వైసీపీ నాయకులకు అవసరం లేకున్నా ట్రాన్స్‌పార్మర్లు, సర్వీసు ఇచ్చారని ఆరోపించారు. మండలంలోని పలు గ్రామాల్లో వైసీపీ నాయకులు తమకు అక్కర లేకున్నా ఎమ్మెల్యే పలుకుబడితో ట్రాన్స్‌ఫార్మర్లు తీసుకుని ఇంట్లో ఖాళీగా ఉంచుకున్నారన్నారు. ఇందుకు తగిన ఆధారాలు తనవద్ద ఉన్నాయన్నారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని పలుసార్లు కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందన్నారు. పలు గ్రామాల్లో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమస్య కేవలం ఒక్క పోతుపేటలోనే కాదని, పోతుపేట పంచాయతీ పీడుంవారి


విద్యుత్ కనెక్షన్ కోసం ట్రాన్స్‌కో అధికారులకు డబ్బులు చెల్లించిన రసీదు (ఇన్‌సర్ట్‌లో) వైసీపీ నేత ఇంట్లో నిరుపయోగంగా ట్రాన్స్‌ఫార్మర్

పల్లెతో పాటు మండలంలోని పలు పంచాయతీల్లో ఇదే పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి గ్రామ పంచాయతీల్లోని తాగునీటి పథకాలకు ట్రాన్స్‌పార్మర్లను మంజూరు చేయకపోతే సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు.

ఎస్సీ, ఎస్టీల ఇళ్లకు ఉచిత విద్యుత్ కొనసాగించాలి


సమావేశంలో మాట్లాడుతున్న బాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీటీఎం శివప్రసాద్

మదనపల్లె అర్బన్, జూలై17: ఎస్సీ. ఎస్టీల ఇళ్లకు 200 యూనిట్ల దాకా ఉచితంగా విద్యుత్ అందించే పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని బాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీటీఎం శివప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం బాస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2013లో తమ సంస్థ నిర్వహించిన నిరవధిక సమ్మెతో అప్పటి సీఎం కిరణ్ కుమార్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి దామోదారం రాజ నర సింహులు స్పందించి ఎస్సీ ఎస్టీల ఇళ్లకు ఉచితంగా విద్యుత్ అందించారని గుర్తు చేశారు. మొదట్లో 50 యూనిట్లు, తరువాత 100, ఆ తరువాత 200 యూనిటకు పెంచారన్నారు. రాష్ట్రం విడిపోయాక కూడా ఈ పథకం అమల్లో ఉందన్నారు. ఇప్పుడు ప్రభుత్వం మారగానే కొత్త నిబంధనల పేరుతో కొన్ని ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీలకు కరెంటు బిల్లు చేతిలో ఉంచి కట్టాల్సిందేనని హెచ్చరిస్తున్నట్లు తెలిపారు. వీరిని మళ్లీ చీకటివైపు నెట్టడానికి ప్రయత్నిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బాస్‌నాయకులు రెడ్డెప్ప, శ్రీనివాసులు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం నారు విక్రయిస్తున్న నర్సరీలపై చర్యలు తీసుకోండి

మదనపల్లె అర్బన్, జూలై17: నాసిరకం నారు అమ్ముతున్న నర్సరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధ వారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏపీ కౌలు రైతుల సంఘం, ఏపీ రైతుల సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 20 నుంచి 30 వేల ఎకరాల్లో బొప్పాయి సాగవుతుండగా, సన్న, చిన్న కారు కౌలు రైతులే అధికంగా ఉన్నారన్నారు. రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని నర్సరీ యాజమానులు నాసిరకం నారును అంటగట్టి కోట్లాది రూపాయలను సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. రైతులు మాత్రం పీకలలోతు అప్పుల్లో కూరుకుపోయి ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్లో నాసిరకం విత్తనాలు అమ్ముతున్న కంపెనీలు, నాసిరకం నారు పెంచుతున్న నర్సరీలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. జిల్లాలోనే దాదాపుగా పదివేల ఎకరాల్లో బొప్పాయి పంట వేసి నష్టపోయారని గుర్తు చేశారు. ఎనిమిది నెలల క్రితం కలికిరి, మదనపల్లెలోని నర్సరీల నుంచి ఒక మొలక రూ. 12 చొప్పున నారు కొనుగోలు చేసి రైతులు నాటారని, వాటికి కుక్క మూతి పిందెలే కాస్తున్నాయని, చెటుపై కాయ నిలబడడం లేదని రైతులు ఆరోపించారు. ఎకరానికి 2 నుంచి మూడు లక్షలు ఖర్చు చేసి పంట సాగు చేస్తే, కనీసం రెండు టన్నులు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. కౌలు రైతులకు ఉద్యాన అధికారులు ఎలాంటి ప్రోత్సాహం ఇవ్వడంలేదన్నారు. నర్సరీలపై నిఘా లేకపోవడంతో విచ్చల విడిగా నాసిరకం ఉత్పత్తులు విక్రయిస్తున్నారరు. బొప్పాయి పంటకు బీమా అమల్లో లేదన్నారు. భవిష్యత్‌లోనైనా అ.ధికారులు నాసిరకం విత్తన విక్రయాలపై నిఘా పెట్టాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం గౌరవాధ్యక్షుడు పీఎల్ నరసింహులు, రైతు సంఘం నాయకులు రామకృష్ణ, గంగిరెడ్డి, అనిల్‌కుమార్, గంగరాజు, రామమూర్తి, గురునాథ్, నారాయణ, రాఘవేంద్రయాదవ్, తదితరులు పాల్గొన్నారు.



నాసిరకం కాయలను చూపుతున్న రైతు సంఘం నాయకులు

అన్నమాచార్య కళాశాలలో వందశాతం సీట్ల భర్తీ

సికెదిన్నె, జూలై 17: కడప అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో వంద శాతం సీట్లు భర్తీ అయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఏపీఈ ఏపీసెట్ సీట్ల కేటాయింపులో బుధవారం విడుదల చేసిన లిస్టులో కడప అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల వంద శాతం సీట్లు భర్తీ కావడం పట్ల విద్యాసంస్థల అధినేత గంగిరెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. తమ విద్యాసంస్థల మీద ఎంతో నమ్మకంతో తమ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్, సీఎస్ఈ, ఇంటలిజెన్స్, లెసన్ లర్నింగ్, ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్, డేటా సైన్స్, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్స్‌లో వంద శాతం సీట్లు భర్తీ కావడంపట్ల ఆనందం వ్యక్తం చేశారు. తాము విద్యార్థులకు అందించే అన్ని రకాల వసతులు, నాణ్యమైన విద్య తమ కళాశాలలో విద్యార్థులు పెంచుకునేలా చేశాయన్నారు. తమ కళాశాలలో సీట్లు వచ్చిన ప్రతి విద్యార్థి ఈనెల 22 తేదీ లోపు రిపోర్టు చేయాలని మరిన్ని వివరాలకు 9603999591, 7386324079 నంబర్లను సంప్రదించాలన్నారు.

గ్రామాల్లో ఘనంగా పీర్ల ఊరేగింపు


సంగసముద్రంలో కొలువుదీరిన పీర్లు


ఎర్రకోటపల్లెలో పీర్ల ఊరేగింపు


పెద్దమండ్యంలో...

గుర్రంకొండ, జూలై 17: మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు మొహర్రంను వేడుకగా జరుపుకున్నారు. పీర్లను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. అనంతరం మొక్కులు తీర్చుకొన్నారు.

కలకడ: మండలంలోని ఎర్రకోటపల్లెతోపాటు వివిధ గ్రామాల్లో చావడిల వద్ద పీర్లను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. అనంతరం మొక్కులు తీర్చుకున్నారు.

పెద్దమండ్యం: పెద్దమండ్యం, పాపేపల్లి గ్రామ పంచాయతీ గుడిసెవారిపల్లి, తురకపల్లి గ్రామాలలో పీర్ల మెరవణి నిర్వహించారు. అనం తరం జలధికి తరలించారు. బాబాబేగ్, వుసేన్‌సాబ్, రెడ్డిగౌస్, అమీన్‌పీర్, కుళాయిరెడ్డి, అలంసాబ్ గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్: స్థానిక నెహ్రూ బజార్‌లోని తాటమాను మకాన్‌లో ఏర్పాటు చేసిన పీర్లను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. బొరుగులు, చక్కెర, బెల్లం చదివించారు. పలువురు భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. పీర్లను ఊరేగింపు గా తీసుకెళ్లి కొత్తపల్లె వద్ద ఉన్న బావిలో జలధోత్సవం నిర్వహించారు. స్థానిక పెద్ద మసీదు పక్కన ఉన్న పపాయ్ మకాన్‌లో పీర్లను ప్రత్యేకంగా అలంకరించారు.

కురబలకోట: మండలంలోని అంగళ్ళు, కురబల కోట, ముదివేడు తదితర గ్రామాల్లో కులమతాలకు అతీతంగా హిందూ,ముస్లింలు వేడుకలను నిర్వహించారు. గ్రామ వీధుల్లో పీర్లను ఊరేగించారు. అనంతరం మొక్కులు చెల్లించారు.

రామసముద్రం: మండలంలోని తిరుమలరెడ్డి పల్లె, ఆర్.నడింపల్లె, మండల కేంద్రంలోని దిగువపేట, ఎగువపేట పీర్లను ప్రత్యేక ప్రభలలో ఉంచి పురవీధులలో ఊరేగించారు. తిరుమల రెడ్డిపల్లెలో మంగళవారం రాత్రి పానకంతో కూడిన మట్టి కుండలను మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి అగ్నిగుండం చుట్టూ తిరిగి మహిళలు మొక్కులను చెల్లించుకున్నారు. నడింపల్లె, తిరుమలరెడ్డిపల్లె, మండల కేంద్రంలో పీర్లు ప్రభలతో కలసి ఊరేగింపుగా వెళ్లి దిగువపేటలో మిలాఖత్ అయ్యాయి. ఈ వేడుకలు తిలకించడానికి మండల చుట్టుపక్కల ప్రజలు తరలి వచ్చారు. మండల టీడీపీ అధ్యక్షుడు విజయ కుమార్ గౌడు తిరుమలరెడ్డిపల్లెలో వేడుకలలో పాల్గొని, అన్నదానం చేశారు. కులమతాలకు అతీతంగా ఈ వేడుకలు ఘనంగా జరిగాయి.


మదనపల్లెలో కొలువుదీరిన పీర్లు


రామసముద్రం: మొక్కులు తీర్చుకుంటున్న మహిళలు

చిన్న చిన్న జాగ్రత్తలతో ప్రాణాంతక జబ్బుల నివారణ

పీలేరు, జూలై 17: చిన్న చిన్న జాగ్రత్తలతో ఎన్నో ప్రాణాంతక వ్యాధులను నయం చేసుకోవచ్చునని తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి రమేశ్ రెడ్డి విద్యార్థినులకు సూచించారు. పీలేరులోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. వసతి గృహంలో తయారు చేసిన ఆహార పదార్థాలు, వంట గదుల శుభ్రత, మరుగుదొడ్లు, పరిసరాలు, తాగునీటి నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతిసార, టైఫాయిడ్, కామెర్లు వంటి వ్యాధులు లేని జీవనానికి కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఈగలు వాలని తాజా ఆహారం తీసుకోవాలన్నారు. బయటి తిండి తినరాదని, ఆహార పదార్థాలను ఎప్పుడూ కప్పి పెట్టుకోవాలని విద్యార్థులకు తెలియజేశారు. మల విసర్జన, భోజనానికి ముందు విధిగా సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలని తెలపడమే కాకుండా చేతులు శుభ్రం చేసుకునే విధానాలను వివరించారు. హెచ్ఈ కొండయ్య, ఏఎన్ఎం ఫామున్నిసా, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


చేతులు శుభ్రం చేసుకునే విధానాన్ని వివరిస్తున్న డాక్టర్ రమేశ్ రెడ్డి

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు

పెద్దతిప్పసముద్రం జూలై 17 : మండల కేంద్రంలోని శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో బుధ వారం తొలి ఏకాదశిని పురస్కరించుకుని సనగరం పట్టాభిరామయ్య అధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన వేద పండితులు, ఆలయ అర్చకులు ఆలయంలో పూజలు, నారా యణహోమం చేశారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు. పీటీఎం తో పాటు సమీప గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.


పూర్ణాహుతి సమర్పిస్తున్న వేదపండితులు

సీపీఐ జిల్లా సమావేశాన్ని జయప్రదం చేయండి

ములకలచెరువు, జూలై 17: జిల్లా కేంద్రంలో జరగనున్న జిల్లాస్థాయి సీపీఐ కార్యవర్గ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణప్ప, నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం మండల కార్యదర్శి అంజనప్ప అధ్యతన మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమావేశంలో జిల్లా సమగ్రాభి వృద్ధిపై చర్చిస్తారన్నారు. రాష్ట్ర నాయకులు హాజరయ్యే సమావేశానికి తంబళ్లపల్లె నియోజక వర్గం నుంచి భారీ ఎత్తున నాయకులు, కార్య కర్తలు హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు వేమనారాయణ, భాస్క ర, చౌడప్ప, చంద్ర, ఎల్లప్ప, ఉత్తన్న, రామకృష్ణ, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణప్ప

తిరుపతి మాలల సమావేశం జయప్రదం చేయండి

వాల్మీకిపురం, జూలై 17: ఈనెల 22వ తేదీ సోమవారం తిరుపతి పట్టణం యూత్ హాస్టల్‌లో నిర్వహించనున్న సమావేశాన్ని జయప్రదం చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి వీరభద్రయ్య, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు శివయ్య బుధ వారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ యమల సుదర్శన్ హాజరవుతారని, మాలమహానాడు భవిష్యత్ కార్యాచరణ, గత ప్రభుత్వంలో రద్దయిన పథకాల పునరుద్ధరణపై చర్చిస్తామన్నారు. ఈ సమావేశానికి మాలలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మంత్రి నారా లోకేష్‌ను కలిసిన అబ్బూరి

కలకడ, జూలై 17:రాష్ట్ర విద్యా, మానవ వనరులు, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్‌ను సచివాలయంలోని చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసినట్లు టీఎన్ ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అబ్బూరి చంద్ర బాబునాయుడు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పేద, బలహీన వర్గాల విద్యార్థులకు ప్రయోజనం కలిగే విధంగా నిర్ణయాలు తీసుకున్నందుకు సంతోషాన్ని వ్యక్తపరిచినట్లు తెలిపారు. ప్రభుత్వం ద్వారా ఉచితంగా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయడం, బీసీ, ఎస్సీ వసతి గృహాల ద్వారా మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.


మంత్రి లోకేష్‌తో అబ్బూరి

ఏజీటీయూపీఎస్ఎస్ కార్యవర్గం ఎన్నిక


ప్రమాణ స్వీకారం చేస్తున్న ఏజీటీయూపీఎస్ఎస్ కార్యవర్గ సభ్యులు

పీలేరు, జూలై 17: అఖిల గాండ్ల, తెలికల ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సంక్షేమ సంఘం(ఏజీటీయూపీఎస్ఎస్) అన్నమయ్య జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక బుధ వారం పీలేరులో జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు వాకాటి హరికృష్ణ గాండ్ల పర్యవేక్షణలో, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రెడ్డి రమేశ్ పరిశీలకుడిగా వ్యవహరించిన ఈ ఎన్నికల్లో అన్నమయ్య జిల్లా గౌరవాధ్యక్షుడుగా సిద్ధవటం సుగుణాకర్(పీలేరు), అధ్యక్షుడుగా నారు శ్రీధర్(రాయచోటి), ప్రధాన కార్యదర్శిగా రమణయ్య(పీలేరు), కోశాధికారిగా సి.కిరణ్(మదనపల్లె), ఉపాధ్యక్షుడుగా నారు విష్ణువర్ధన్ (రాయచోటి), సహాయ కార్యదర్శులుగా భీమయ్య, నారాయణ స్వామి, ఈశ్వరయ్య (మదనపల్లె), కార్యవర్గసభ్యులుగా రెడ్డి, ఆనందబాబు తదితరులు ఎన్నికయ్యారు. అనంతరం నూతన అధ్యక్షుడు శ్రీధర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా లోని గాండ్ల కులం ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమం కోసం తాము కృషి చేస్తామన్నారు. కొత్తగా ఎన్నికైన వారిని మిగిలిన సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో షోళింగర్ గిరి శ్రీనివాస్, సీపీఎస్ సంఘ నాయకుడు పచ్చార్ల సుధాకర్, కృష్ణయ్య, కుమాతేజ, శేఖర్, చంద్రశేఖర్, వెంకటరమణ, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

అస్తిత్వ ఉద్యమాలకు 'కారంచేడు' స్ఫూర్తి

పీలేరు, జూలై 17: ఆంధ్రప్రదేశ్‌లో అస్తిత్వ ఉద్యమాలకు కారంచేడు ఉద్యమం స్ఫూర్తి గా నిలిచిందని పీలేరు పట్టణానికి చెందిన దళిత సంఘాల నాయకులు అన్నారు. పీలేరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ముందు బుధవారం కారంచేడు అమర వీరుల 39వ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా 'బాస్' జిల్లా కన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు, మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధరణీ కుమార్, ఎంఆర్‌పీఎస్ ఇన్‌చార్జి గండికోట వెంకటేశ్ మాట్లాడుతూ కారంచేడు సంఘటన తరువాత రాష్ట్రంలోని మాలలు, మాదిగలు, ఎరుకల కులస్థుల్ని ఏకతాటిపై తెచ్చిందన్నారు. కారంచేడు ఊచకోత దారుణాన్ని సహించలేక ఒక్కసారిగా ఉద్యమానికి పూనుకున్నారన్నారు. నెత్తుటి దారిలో మొదలైన ఆ ఉద్యమం రాష్ట్రమంతటికీ వ్యాపించిందని, ఆ తరువాత జరిగిన అనేక ఉద్యమాలకు దిక్సూచిగా నిలిచిందన్నారు. అనంతరం ఆ సంఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముల్లంగి కృష్ణయ్య, ఎర్రబెల్లి మల్లికార్జున, పల్లెపోగు హరినాథ, ముల్లంగి గురవయ్య, నాగేశ్వరరావు, మాలమహానాడు నాయకులు గుండ్లూరి రవీంద్ర, దప్పేపల్లె ఆనంద, నాగేంద్ర, సురేంద్ర,ద్వారక, తదితరులు పాల్గొన్నారు.


కారంచేడు మృతులకు నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నేతలు

నేడు పీలేరు మండల సమావేశం

పీలేరు, జూలై 17: పీలేరు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో ఉపేందర్ రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కంభం సతీశ్ రెడ్డి కుమార్ రెడ్డి నేతృత్వంలో జరగనున్న ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని ఆయన తెలిపారు.

రేపు కలకడలో..: మండల సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పరమేశ్వరరెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు హాజరు కావాలని కోరారు.